విలేకర్లు కావలెను
తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో
అది తక్కువ సమయంలో ప్రజాధరణ పొందుతున్న
మన ప్రజాశక్తి తెలుగు దినపత్రికలో
అనుభవం, ఆసక్తిగల విలేకర్లు కావలెను
ఎటువంటి టార్గెట్లు లేవు
జిల్లా స్టాఫ్ రిపోర్టర్
నియోజకవర్గ ఆర్.సి
మండల రిపోర్టర్
సంప్రదించండి : 9030320743

తెలుగు దినపత్రిక
మన ప్రజాశక్తి
ప్రజాగళమే.. మా కలం
www. ManaPrajasakti.com
తెలంగాణ \ ఆంధ్రప్రదేశ్




నల్గొండ | శనివారం | 25-7-2026 | ఎడిటర్: మెరుగు. భరత్ కుమార్ | సంపుటి: 1 | సంచిక:295 | పేజీలు: 8 | వెల: రూ.4/-

### నీట్‌పై ప్రధాని వీడియో
# దయనీయం

- నీట్ వివాదంపై ప్రధాని మోదీ వీడియోను తీవ్రంగా విమర్శించిన రాహుల్
- విద్యార్థుల మేధస్సును ప్రధాని అవమానిస్తున్నారని ఆరోపణ
- కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా



**న్యూఢిల్లీ,జూలై24,**
నీట్ పరీక్షల పేపర్ లీకేజీ వివాదంపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విడుదల చేసిన వీడియోపై లోక్‌సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. అర్ధరాత్రి విడుదల చేసిన ఈ వీడియో విద్యార్థుల మేధస్సును అవమానపరిచేలా ఉందని ఆయన విమర్శించారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ తక్షణమే తన పదవికి రాజీనామా చేయాలని ఆయన మరోసారి డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం సోషల్ మీడియా వేదిక 'ఎక్స్' ద్వారా రాహుల్ గాంధీ స్పందించారు. "ప్రధాని విడుదల చేసిన అర్ధరాత్రి వీడియో అత్యంత దయనీయంగా ఉంది. ఇది విద్యార్థులను అవమానించడమే" అని ఆయన పేర్కొన్నారు. నీట్ వివాదానికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి రాజీనామా చేయాలని, నిరసన తెలుపుతున్న విద్యార్థులపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, విద్యార్థులకు ప్రధాని మోదీ క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు.

### ఇందిరమ్మ ఇండ్లు జనావాసాల పరిధిలోనే
# ఉండేలా చూడాలి

- ఉద్యోగ, ఉపాధికి దగ్గరగా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం
- జనావాసాల్లోనే ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ

- నిరుపయోగంగా ఉన్న ప్రభుత్వ స్థలాలను వెంటనే గుర్తించి ఇళ్ల నిర్మాణానికి వినియోగించేలా చర్యలు చేపట్టాలి
- ఔటర్ రింగ్ రోడ్(ఓఆర్ఆర్) లోపల ఉన్న ఖాళీ ప్రభుత్వ భూములపై ప్రత్యేక దృష్టి సారించాలి



**హైదరాబాద్,జూలై24,**
: క్యూర్ జోన్ పరిధిలో నిర్మించే ఇందిరమ్మ ఇండ్లు జనావాసాల పరిధిలోనే ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఔటర్ రింగ్ రోడ్డు లోపల వివిధ శాఖలకు సంబంధించి నిరుపయోగంగా ఉన్న స్థలాలను గుర్తించాలని అధికారులకు సూచించారు. కోర్ అర్బన్ ఏరియాలో ఇందిరమ్మ ఇండ్లపై ముఖ్యమంత్రి, మంత్రులు పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నంప్రభాకర్ తో పాటు వివిధ శాఖల ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. పలు నియోజకవర్గాల్లో ఇప్పటికే గుర్తించిన స్థలాల గురించి అధికారులు సీఎంకు వివరించారు. పోలీస్, రెవెన్యూ, రవాణా శాఖలకు సంబంధించి గుర్తించిన నిరుపయోగ స్థలాలను తీసుకుని, ప్రత్యామ్నాయంగా సంబంధిత శాఖలకు వేరేచోట స్థలాన్ని కేటాయించాలని ఆదేశించారు.జనావాసాలకు దూరంగా ఇందిరమ్మ ఇండ్లను కేటాయిస్తే.. ఉద్యోగ, ఉపాధి అవకాశాలకు ఇబ్బందులు తలెత్తడంతో పాటు అవి నిరుపయోగంగా మారే అవకాశం ఉందని రేవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు. పని ప్రదేశాలకు దగ్గరగా, జనావాసాల పరిధిలోనే ఇందిరమ్మ ఇండ్లు నిర్మించేలా చూడాలని చెప్పారు. దీని వల్ల నిరుపేదలు జీవనోపాధి కోల్పోకుండా ఉంటారన్నారు. క్యూర్ ఏరియాలో పలు నియోజకవర్గాల్లో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని రాష్ట్రం ప్రభుత్వం ప్రకటన చేసింది. ఒక్కో ఫ్లాట్ దాదాపు 528 చదరపు అడుగుల విస్తీర్ణంతో, 400 చదరపు అడుగుల కార్పెట్ ఏరియాతో నిర్మించనుంది. ఒక్కో ఇంటి నిర్మాణానికి దాదాపు రూ. 11 లక్షలు ఖర్చవుతుండగా, ప్రభుత్వం ఇందులో రూ. 5 లక్షల మేరకు సబ్సిడీని అందిస్తోంది.



### విద్యార్థుల భవిష్యత్తుకే
# తొలి ప్రాధాన్యం

- పేపర్ లీక్‌లపై కఠిన చట్టానికి సిద్ధమైన కేంద్రం
- నేటి క్యాబినెట్ భేటీలో బిల్లుపై నిర్ణయం
- వేగవంత విచారణకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల ఏర్పాటుకు ఆదేశం

**న్యూఢిల్లీ,జూలై24,**
దేశవ్యాప్తంగా తీవ్ర కలకలం రేపిన పోటీ పరీక్షల పేపర్ లీకేజీ వ్యవహారాలపై కేంద్ర ప్రభుత్వం మరింత కఠినంగా వ్యవహరించేందుకు సిద్ధమైంది. ఈ అక్రమాలకు శాశ్వతంగా చెక్ పెట్టేందుకు ఉద్దేశించిన నూతన బిల్లుపై శుక్రవారం జరిగే కేంద్ర మంత్రివర్గ సమావేశంలో తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ప్రధాని నరేంద్ర మోదీ వెల్లడించారు. ఆమోదం పొందిన వెంటనే ఈ బిల్లును అతి త్వరలోనే పార్లమెంటులో ప్రవేశపెట్టి చట్టంగా మారుస్తామని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా విద్యార్థులు, నిరుద్యోగుల నుంచి వెల్లువెత్తుతున్న ఆందోళనల నేపథ్యంలో ప్రధాని గురువారం అర్ధరాత్రి దాటాక ఒక ప్రత్యేక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. కేవలం 12 గంటల వ్యవధిలోనే ఈ సున్నితమైన అంశంపై ఆయన రెండుసార్లు ప్రకటనలు చేయడం గమనార్హం. పేపర్ లీకేజీలు అనేవి సాధారణమైన పొరపాట్లు కావని, అవి లక్షలాది మంది విద్యార్థుల కష్టాన్ని, వారి తల్లిదండ్రుల నమ్మకాన్ని తీవ్రంగా దెబ్బతీసే ద్రోహమని ప్రధాని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేరాలకు పాల్పడిన ప్రధాన నిందితులను ఇప్పటికే అరెస్టు చేసి జైలుకు పంపించామని, విచారణను వేగవంతం చేసేందుకు ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాల్సిందిగా అధికారులను ఆదేశించినట్లు వివరించారు.

### ఢిల్లీలో జరిగిన నీట్ ఆందోళనల్లో కేసీఆర్
# ఎందుకు లేరు?

- బీజేపీతో బీఆర్ఎస్ పార్టీకి లోపాయకారీ ఒప్పందం ఉందన్న మహేశ్ గౌడ్
- వారి ఎంపీ స్థానాలను బీజేపీకి దానం చేశారని ఆరోపణ
- రాజకీయ ప్రయోజనాల కోసం నిరుద్యోగులను వాడుకున్నారని విమర్శ



**హైదరాబాద్,జూలై24,**
ఢిల్లీలో జరిగిన విద్యార్థుల ఆందోళన కార్యక్రమాల్లో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎందుకు పాల్గొనలేదని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రశ్నించారు. బీజేపీతో ఉన్న లోపాయకారీ ఒప్పందం కారణంగానే బీఆర్ఎస్ నేతలు ఢిల్లీకి వెళ్లి నిరసన తెలపలేకపోయారని ఆయన విమర్శించారు. గత పార్లమెంట్ ఎన్నికల్లో సున్నా సీట్లు తెచ్చుకుని, వారి ఎంపీ స్థానాలను బీజేపీకి దానం చేశారని ఆరోపించారు. దేశంలో పలు ప్రాంతీయ పార్టీల వలే బీఆర్ఎస్ కూడా బీజేపీ గుప్పిట్లోనే ఉందనేది పచ్చి నిజమని, అందుకే గడిచిన పదేళ్లలో బీజేపీ ప్రతిపాదించిన బిల్లులన్నింటికీ బీఆర్ఎస్ మద్దతుగా నిలిచిందని వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్వయంగా ఢిల్లీకి వెళ్లకపోయినా, నీట్ ఉద్యమానికి పూర్తిస్థాయిలో మద్దతుగా నిలిచారని అన్నారు.



### పసిడి ప్రియులకు స్వల్ప
# ఊరట

**హైదరాబాద్,జూలై24,**
బంగారం ధరలు శుక్రవారం స్వల్పంగా తగ్గాయి. గత రెండు రోజులతో పోలిస్తే పసిడి, వెండి ధరలు స్వల్పంగా క్షీణించడం కొనుగోలుదారులకు కొంత ఊరటనిచ్చే పరిణామం. దేశీయ మార్కెట్లో నేటి ఉదయం నమోదైన గణాంకాల ప్రకారం, తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాల్లో ధరలు స్థిరంగా కొనసాగుతున్నాయి.హైదరాబాద్, విజయవాడ మార్కెట్లలో 10 గ్రాముల 24 క్యారెట్ల బంగారం ధర రూ.1,46,170గా నమోదైంది.

### తెలంగాణ ఆర్టీసీ
# ఉద్యోగులకు గుడ్‌న్యూస్

- ప్రభుత్వంలో ఆర్టీసీ విలీన ప్రక్రియకు వేగంగా అడుగులు
- ఆగస్టు మూడో వారంలో గుర్తింపు సంఘం ఎన్నికలు నిర్వహించే అవకాశం
- డిసెంబరు 9న విలీనంపై తుది ప్రకటన చేసేందుకు ప్రభుత్వ కసరత్తు
- విలీన విధివిధానాల్లో ఎన్నికల్లో గెలిచిన సంఘానికి భాగస్వామ్యం
- ఏప్రిల్ సమ్మె హామీలను నెరవేర్చే దిశగా ప్రభుత్వ చర్యలు

**హైదరాబాద్,జూలై24,**
తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగుల దశాబ్దాల కల నెరవేరే దిశగా కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆర్టీసీ సిబ్బందిని ప్రభుత్వంలో విలీనం చేయాలన్న చిరకాల వాంఛను నెరవేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేగంగా కసరత్తు చేస్తోంది. ప్రణాళిక ప్రకారం అన్నీ జరిగితే, తెలంగాణ ఆవిర్భావ ప్రకటన వెలువడిన డిసెంబరు 9వ తేదీన విలీనంపై తుది నిర్ణయాన్ని ప్రకటించే అవకాశం ఉందని విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈలోగా విలీన ప్రక్రియకు సంబంధించిన పూర్తి విధివిధానాలను సిద్ధం చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు.విలీన ప్రక్రియలో భాగంగా




ప్రభుత్వం ముందుగా ఆర్టీసీ గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికలను పూర్తి చేయాలని నిర్ణయించింది. ఇందుకోసం లేబర్ జాయింట్ కమిషనర్ సునీతను నోడల్ అధికారిగా నియమించింది. ఆగస్టు మూడో వారంలో ఈ ఎన్నికలు నిర్వహించే అవకాశాలున్నాయి. ఎన్నికల్లో గెలిచిన సంఘాన్ని విలీన విధివిధానాల రూపకల్పనలో భాగస్వామ్యం చేస్తామని రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ ఇప్పటికే స్పష్టం చేశారు.

### అనుమతి లేకుండా వీడియోలను
# అప్‌లోడ్ చేయడంపై నిషేధం

**కోర్టు విచారణలను విచ్చలవిడిగా, అసంపూర్తిగా ప్రసారం చేయడంపై సుప్రీంకోర్టు ఆగ్రహం**



**న్యూఢిల్లీ,జూలై24,**
కోర్టు విచారణలకు సంబంధించిన ఆడియో, వీడియో రికార్డింగ్‌లను సోషల్ మీడియాలో విచ్చలవిడిగా, అసంపూర్తిగా ప్రసారం చేయడాన్ని సుప్రీంకోర్టు తీవ్ర ంగా పరిగణించింది. కోర్టు కార్యకలాపాల వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేయడాన్ని సీసాలో నుంచి బయటకు వచ్చిన భూతంతో పోల్చిన ధర్మాసనం, సంబంధిత కోర్టుల ముందస్తు అనుమతి లేకుండా వాటిని పోస్ట్ చేయడం, ఎడిట్ చేయడం లేదా రీ-పోస్ట్ చేయడంపై మధ్యంతర స్టే విధిస్తూ సంచలన ఆదేశాలు జారీ చేసింది.

### భారతదేశ క్వాంటమ్ భవిష్యత్తుకు
# అమరావతి ముఖద్వారం

- క్వాంటం టెక్నాలజీలో ఏపీని గ్లోబల్ హబ్‌గా మార్చే లక్ష్యం
- ప్రముఖ క్వాంటం కంపెనీ 'క్వాంటినమ్' సీఈవోతో నిన్న సీఎం చంద్రబాబు భేటీ



**అమరావతి,జూలై24**

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని క్వాంటం టెక్నాలజీ రంగంలో దేశానికి ముఖద్వారంగా (గేట్‌వేగా) తీర్చిదిద్దేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రణాళికలు రచిస్తున్నారు. ఈ దిశగా మరో కీలక అడుగు పడింది. ప్రపంచంలోని ప్రముఖ క్వాంటం కంప్యూటింగ్ సంస్థ 'క్వాంటినమ్' సీఈవో డాక్టర్ రాజీబ్ హజ్రాతో, ఆయన బృందంతో సీఎం చంద్రబాబు నిన్న సమావేశమవడం తెలిసిందే. ఆంధ్రప్రదేశ్‌తో భాగస్వామ్యం ద్వారా దేశ క్వాంటం ఆశయాలను బలోపేతం చేయడంపై ఈ భేటీలో విస్తృతంగా చర్చించారు. ఈ సమావేశంపై ముఖ్యమంత్రి చంద్రబాబు నేడు సోషల్ మీడియా వేదికగా కీలక వివరాలను పంచుకున్నారు. క్వాంటం టెక్నాలజీకి సంబంధించి ప్రపంచస్థాయి పోటీని తట్టుకునేలా ఏపీలో ఒక సమగ్ర వ్యవస్థను (ఎకోసిస్టమ్) నిర్మించడమే తమ లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు.

# ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు



మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి



**అడవిదేవులపల్లి/ జూలై 24 (మన ప్రజాశక్తి )**

అడవిదేవులపల్లి మండల కేంద్రంలో శుక్రవారం నాడు అడవిదేవులపల్లి మండలానికి చెందిన సర్పంచ్‌లు, బూత్ లెవల్ ఏజెంట్లుతో నిర్వహించిన సమావేశంలో మిర్యాలగూడ శాసనసభ్యులు బత్తుల లక్ష్మారెడ్డి పాల్గొన్నారుఈ సందర్భంగా ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి మాట్లాడుతూ, ఓటరు జాబితా ప్రత్యేక ఇంటెన్సివ్ రివిజన్ (ా×=) ప్రక్రియను అత్యంత బాధ్యతాయుతంగా చేపట్టి,అడవిదేవులపల్లి మండలంలోని ప్రతి గ్రామంలో 100 శాతం పూర్తి చేసేలా కాంగ్రెస్ పార్టీ శ్రేణులు కృషి చేయాలని సూచించారుఓటర్ల నమోదు, మార్పులు, చేర్పులు, తొలగింపుల ప్రక్రియలో ఎలాంటి అర్హులైన ఓటరు కూడా మిస్ కాకుండా ఇంటింటికీ వెళ్లి అవగాహన కల్పించాలని, ప్రతి బీఎల్ఏ తమకు కేటాయించిన బూత్ పరిధిలో పూర్తి స్థాయిలో పని చేయాలని ఆయన పిలుపునిచ్చారు.ప్రజాస్వామ్యంలో ఓటు అత్యంత విలువైన హక్కు అని, ప్రతి అర్హుడైన పౌరుడు ఓటరు జాబితాలో పేరు నమోదు చేసుకునేలా సర్పంచ్‌లు, పార్టీ నాయకులు, బీఎల్ఏలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు స్కైలాబ్ నాయక్, పొదిల శ్రీనివాస్ రామావత్ బాలు నాయక్, బండి నాగేశ్వరరావు గోపగాని హనుమంతు బండి నరసింహారావు గుండా శ్రీనివాస్ మరియు సర్పంచ్‌లు, బీఎల్ఏలు, ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలి..

**బొల్లవరం పాఠశాలలో తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల సమావేశంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి.. విద్యార్థులతో కలిసి భోజనం.. తల్లిదండ్రులకు విలువైన సూచనలు..**



**నందికొట్కూరు (మన ప్రజాశక్తి):-**

నందికొట్కూరు మండలం బొల్లవరం గ్రామ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల (ాూవీ) సమావేశం ఉత్సాహభరితంగా జరిగింది. ఈ కార్యక్రమానికి నందికొట్కూరు మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు చదువుతో పాటు క్రీడలు, సాంస్కృతిక కార్యక్రమాలు మరియు ఇతర రంగాల్లో కూడా ప్రతిభ కనబరుస్తూ సమగ్ర వ్యక్తిత్వాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. నేటి విద్యార్థులే రేపటి దేశ భవిష్యత్తని పేర్కొంటూ, ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని కృషి చేయాలని పిలుపునిచ్చారు.

తల్లిదండ్రులు తమ పిల్లల చదువుపై ప్రత్యేక శ్రద్ధ చూపడంతో పాటు మంచి విలువలు, క్రమశిక్షణ, నైతికతను అలవర్చాలని సూచించారు. ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో పనిచేస్తేనే విద్యార్థులు ఉన్నత స్థాయికి చేరుకుంటారని అన్నారు.

అనంతరం వీరం ప్రసాద్ రెడ్డి విద్యార్థులతో ఆత్మీయంగా ముచ్చటించి, వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వి. రాఘవరెడ్డి, ఎస్. యాల్మియా, జి. రామచంద్రుడు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, తెలుగుదేశం పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# మెగా పీటీఎం 4.0 తల్లిదండ్రులు--ఉపాధ్యాయుల సమావేశం

**నందికొట్కూరు (మన ప్రజాశక్తి):-**

నందికొట్కూరు మండలం కోనేటమ్మపల్లె గ్రామంలోని ఎజూజూజూం పాఠశాలలో మెగా పీటీఎం 4.0 (ఘుతీవత్ం-ుముఎష్త్రవతీం వీవవ్ఱఅస్త్ర) కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి మాజీ సర్పంచ్ దామోదర్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా మాజీ సర్పంచ్ దామోదర్ రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల సమగ్ర అభివృద్ధికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. పిల్లల చదువుపై తల్లిదండ్రులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని, వారి భవిష్యత్తు కోసం పాఠశాలతో నిరంతరం అనుసంధానంగా ఉండాలని కోరారు.మహమ్మద్ రఫీ జయసూర్య రాజు పాఠశాల ప్రధానోపాధ్యాయులు మాట్లాడుతూ, విద్యార్థుల ప్రతిభను మరింత మెరుగుపరచడానికి తల్లిదండ్రుల సహకారం ఎంతో అవసరమని వివరించారు. పిల్లల హాజరు, చదువు, క్రమశిక్షణపై తల్లిదండ్రులు నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థులు పాల్గొని పాఠశాల అభివృద్ధి, విద్యా ప్రమాణాల పెంపుపై చర్చించారు.



# పిల్లల భవిష్యత్తే ప్రధాన లక్ష్యం..



నందికొట్కూరులో కలెక్టర్ రాజకుమారి గునియా సందేశం..





**నందికొట్కూరు (మన ప్రజాశక్తి):-**

నందికొట్కూరు నియోజకవర్గంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో గురువారం సార్థక వాతావరణం నెలకొంది. నంద్యాల జిల్లా కలెక్టర్ రాజకుమారి గునియా పాఠశాలను సందర్శించి విద్యార్థులు, తల్లిదండ్రులతో ఆత్మీయంగా మమేకమయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన తల్లిదండ్రుల ఆత్మీయ సమ్మేళనం కార్యక్రమం ప్రాధాన్యతను సంతరించుకుంది.కార్యక్రమంలో కలెక్టర్ మాట్లాడుతూ పిల్లల ఎదుగుదలలో తల్లిదండ్రుల పాత్ర అత్యంత కీలకమని స్పష్టం చేశారు. పిల్లలపై నిరంతరం శ్రద్ధ వహిస్తూ, వారికి మంచి అలవాట్లు నేర్పించాల్సిన బాధ్యత తల్లిదండ్రులదేనని తెలిపారు. ముఖ్యంగా ఈ ఆధునిక కాలంలో పిల్లలు చెడు ప్రభావాలకు లోనుకాకుండా ఉండేందుకు తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.అలాగే, పిల్లల భవిష్యత్తును నిర్మించడంలో ఉపాధ్యాయుల పాత్రను ఆమె ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఒక మంచి ఉపాధ్యాయుడు విద్యార్థి జీవితాన్ని మార్చగల శక్తి కలిగి ఉంటాడని పేర్కొన్నారు. విద్యతో పాటు విలువలు, నైతికతలు నేర్పించడం ద్వారా మాత్రమే సమాజానికి మంచి పౌరులు అందుతారని అన్నారు.కలెక్టర్ గారు విద్యార్థులతో కొంతసేపు ముచ్చటిస్తూ వారి ఆశయాలు, లక్ష్యాల గురించి తెలుసుకున్నారు. వారి ప్రశ్నలకు సమాధానాలు ఇస్తూ వారికి ప్రోత్సాహం అందించారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేసి వారి మధ్య స్నేహపూర్వక వాతావరణాన్ని నెలకొల్పారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ జి. వెంకటరామిరెడ్డి,ఎస్సై చంద్రశేఖర్, ఎమ్మార్వో శ్రీనివాసులు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు మరియు తల్లిదండ్రులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్శన విద్యార్థుల్లో ఉత్సాహాన్ని నింపడంతో పాటు తల్లిదండ్రుల్లో బాధ్యతాభావాన్ని మరింత బలపరిచింది.

# కేతవరం వాల్మీకి ఆలయ భూమికి శాశ్వత పట్టా డిమాండ్..



ఎమ్మెల్యేకు వినతిపత్రం అందజేసిన బోయ వాల్మీకి సమాజం..

**నందికొట్కూరు (మన ప్రజాశక్తి):-**

నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం కేతవరం గ్రామంలో ఉన్న వాల్మీకి మహర్షి దేవాలయ భూమికి శాశ్వత పట్టా మంజూరు చేయాలని బోయ వాల్మీకి సమాజం నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం స్థానిక పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి కి వినతిపత్రం సమర్పించారు.సంఘం నాయకులు మాట్లాడుతూ..సర్వే నెం.85లో ఉన్న ఈ దేవాలయం గ్రామానికి ఆధ్యాత్మికంగా, చారిత్రకంగా ఎంతో ప్రాముఖ్యత కలిగి ఉందని తెలిపారు. భూమికి శాశ్వత పట్టా మంజూరు చేస్తే భవిష్యత్తులో వచ్చే వివాదాలు నివారించవచ్చని వారు అభిప్రాయపడ్డారు.వినతిపత్రాన్ని స్వీకరించిన ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి సంబంధిత అధికారులతో చర్చించి సమస్యను పరిశీలించి న్యాయం చేసేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు.ఈ కార్యక్రమంలో బోయ వాల్మీకి సమాజం నాయకులు, సభ్యులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# విద్యుత్ తీగలతో పొంచి ఉన్న ప్రమాదం



**మఠంపల్లి రూరల్ జూలై 24(మన ప్రజాశక్తి) :**

హనుమంతులగూడెం గ్రామంలోని కొత్తపల్లి సైదమ్మ--దేవదాసు కుటుంబం నివాస గృహంపై ప్రమాదకరంగా విద్యుత్ తీగలు వేలాడుతూ ఉండటంతో కుటుంబ సభ్యులు నిత్యం ప్రాణభయంతో జీవనం సాగిస్తున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనన్న ఆందోళనతో దిక్కుతోచని పరిస్థితిలో ఉన్నామని బాధిత కుటుంబం ఆవేదన వ్యక్తం చేసింది.ఈ సమస్యపై గ్రామ సర్పంచ్, గ్రామ కార్యదర్శి, విద్యుత్ శాఖ అధికారులకు పలుమార్లు ఫిర్యాదు చేసినట్లు బాధితులు తెలిపారు. గ్రామ సభల్లో కూడా సమస్యను ప్రస్తావించినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపించారు. గత పాలకుల నిర్లక్ష్యం వల్లే ఈ పరిస్థితి ఏర్పడిందని గ్రామస్తులు పేర్కొన్నారు.ఇటీవల తమ కుమారుడిని కోల్పోయిన ఈ కుటుంబం ఇప్పటికే తీవ్ర విషాదంలో ఉందని, ఇప్పుడు ఇంటిపై వేలాడుతున్న విద్యుత్ తీగల కారణంగా మరో ప్రమాదం ఎప్పుడు సంభవిస్తుందోనని భయాందోళనలకు గురవుతున్నామని తెలిపారు.ప్రమాదం జరిగే వరకు వేచి చూడకుండా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి, విద్యుత్ తీగలను సురక్షితంగా మార్చి, కుటుంబ సభ్యుల ప్రాణాలను కాపాడేలా తక్షణ చర్యలు చేపట్టాలని బాధిత కుటుంబంతో పాటు గ్రామస్తులు డిమాండ్ చేశారు.

# సీసీ కాలువ పనులను సమీక్షించిన 1వ వార్డు కౌన్సిలర్ పాకాల మౌనిక హరీష్

**మన ప్రజాశక్తి ఆలేరు మండలం జూలై 24.2026**



యాదాద్రి జిల్లాఆలేరు పట్టణంలోని కొలనుపాక రోడ్డులో జరుగుతున్న సీసీ కాలువ నిర్మాణ పనులను ఒకటవ వార్డు కౌన్సిలర్ పాకాల మౌనిక హరీష్ శుక్రవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పనుల పురోగతిని అడిగి తెలుసుకుని, నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని కాంట్రాక్టర్‌ను ఆదేశించారు.అనంతరం కౌన్సిలర్ పాకాల మౌనిక మాట్లాడుతూ గణేష్ నగర్ నుండి వచ్చే డ్రైనేజ్ పైప్‌ను, అలాగే కొలనుపాక రోడ్డు నుండి పాత మున్సిపల్ ఆఫీస్ ముందు నుంచి వెళ్లే డ్రైనేజీని నూతన సీసీ కాలువలోకి అనుసంధానం చేయాలని కోరారు. కాలువకు ఇరువైపులా మట్టిని సమానంగా (లెవెలింగ్ ను) చేయాలన్నారు. బైరంకుంట నుండి చర్చి ముందు భాగం వైపు వచ్చే వర్షపు నీరు సీసీ కాలువ వద్ద నిలిచిపోయే అవకాశం ఉన్నందున, ఆ నిర్మాణాన్ని పునసమీక్షించాలని సూచించారు. చర్చికోసం ప్రత్యేకంగా ర్యాంపు ఏర్పాటు చేయాలని కోరారు. వర్షాకాలం దృష్ట్యా ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పనులను త్వరితగతిన పూర్తి చేయాలని అధికారులను, కాంట్రాక్టర్‌ను ఆమె కోరారు.

GENERAL జనరల్
మన ప్రజాశక్తి తెలుగు దినపత్రిక
www.ManaPrajasakti.com
తెలంగాణ ఆంధ్రప్రదేశ్

# నీట్ పేపర్ లీకేజీకి బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి చేయాలి





**జంగారెడ్డిగూడెం యువజన, విద్యార్థి, ప్రజా సంఘాల డిమాండ్**

**జంగారెడ్డిగూడెం, జూలై 24: ( మన ప్రజాశక్తి )**

నీట్ (చీజుజు) పరీక్ష పేపర్ లీకేజీ దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తును ప్రశ్నార్థకం చేసిందని, దీనికి నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ వెంటనే రాజీనామా చేయాలని జంగారెడ్డిగూడెం యువజన, విద్యార్థి, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో జగజీవన్ సెంటర్‌లో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో నాయకులు డిమాండ్ చేశారు.

ఈ సందర్భంగా డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి. సూర్యకిరణ్ మాట్లాడుతూ, దేశంలో పరీక్షల నిర్వహణలో తీవ్ర వైఫల్యం చోటుచేసుకుందని, నీట్ పేపర్ లీకేజీ వల్ల కష్టపడి చదివిన విద్యార్థులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టు ఆందోళన వ్యక్తం చేసినా, కేంద్ర ప్రభుత్వం బాధ్యతాయుతంగా వ్యవహరించడం లేదని విమర్శించారు.

అలాగే ఆయన ఈ క్రింది డిమాండ్లను కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు:

నీట్ పేపర్ లీకేజీపై సమగ్ర, స్వతంత్ర విచారణ జరపాలి.

పేపర్ లీకేజీకి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి.

పరీక్షా వ్యవస్థలో పారదర్శకత, భద్రతను పూర్తిగా పటిష్టం చేయాలి.

విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం ఆపాలి.కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ నైతిక బాధ్యత వహిస్తూ వెంటనే రాజీనామా చేయాలి.విద్యను ప్రైవేటీకరణ, వాణిజ్యీకరణ చేసే విధానాలను ఉపసంహరించుకోవాలి.దేశవ్యాప్తంగా విద్యార్థులకు న్యాయం జరిగేలా పారదర్శక పరీక్షా విధానాన్ని అమలు చేయాలి.ఈ నిరసన కార్యక్రమంలో సీఐటీయూ సీనియర్ నాయకులు చల్లారి మాణిక్యాలరావు, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి అందుగుల ఫ్రాన్సిస్, డీవైఎఫ్ఐ జిల్లా నాయకులు మాబు, సుభాని, వెంకటరాజు, కే. సుబ్బారావు, నాని, ఆశీర్వాదం తదితరులు పాల్గొని కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. దేశ విద్యార్థుల భవిష్యత్తును కాపాడాలని, పరీక్షా వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించాలని వారు డిమాండ్ చేశారు.

# యాదాద్రి జిల్లా ఆలేరులో బిఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో



**మన ప్రజాశక్తి ఆలేరు మండలం జూలై 24.2026**

యాదాద్రి జిల్లా ఆలేరులో బిఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీలను మున్సిపల్ సిబ్బంది తొలగించడాన్నీ నిరసిస్తూ బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బస్టాండ్ వద్ద రాస్తారోకో, ధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్ నాయకులు మాజీ ఆర్టిఏ మెంబర్ పంతం కృష్ణ మాట్లాడుతూ మున్సిపల్ అధికారులు అధికార పార్టీకి తొత్తులుగా మారి కావాలని బిఆర్ఎస్ పార్టీ ఫ్లెక్సీలను తొలగిస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు ఇంకా ఈ ధర్నా కార్యక్రమంలో కౌన్సిలర్ పూల శివ, బిఆర్ఎస్ నాయకులు జింకల రామకృష్ణ, బీజని మధు, పాకాల హరీష్, బింగి రవి, మాజీ బీఆర్ఎస్ సర్పంచ్ రచ్చ రామ నరసయ్య,ఫయాజ్ మరియు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు


# సీసీ రోడ్డు ప్రారంభించిన గ్రామ సర్పంచ్

**డోర్నకల్ /మరిపెడ మన ప్రజాశక్తి జూలై 24 :-**

గ్రామ ప్రజల సహాయ సహకారాలతో గ్రామపంచాయతీని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తాం అని అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలి అని సర్పంచ్ అన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధితోనే రాష్ట్ర సమగ్ర ప్రగతి సాధ్యమవుతుందని అందుకే ప్రభుత్వం సంక్షేమంతో పాటు మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని వాల్య తండా గ్రామపంచాయతీ సర్పంచ్ నాగ నాయక్ పేర్కొన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద వాల్య తండా గ్రామపంచాయతీలో 5 లక్షల సీసీ రోడ్ల నిర్మాణాన్ని చేపడుతూ గ్రామంలో మౌలిక సదుపాయాల కల్పనకు తమ పాలకవర్గం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తుందని, గ్రామపంచాయతీ అభివృద్ధికి ప్రతి ఒక్కరు సహకరించాలని చెప్పారు. గ్రామ అభివృద్ధికి అవసరమైన ప్రతి పనిని దశలవారీగా చేపట్టి ప్రజల అవసరాలను తీర్చేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రంలో ఉప సర్పంచ్ టాకిర్య నాయక్, వార్డ్ సభ్యులు, గ్రామ పెద్దమనుషులు, మాజీ ప్రజా ప్రతినిధులు, యూత్ సభ్యులు పాల్గొనడం జరిగింది.



# శూన్య మాసంలో శుభప్రదాయని తొలి ఏకాదశి



**నేటి నుంచే శుభ పర్వాల ఆరంభం.. శ్రీహరి అనుగ్రహానికి అత్యంత పవిత్రమైన రోజు**

హిందూ సనాతన సంప్రదాయంలో ప్రతి ఏకాదశి తిథికి ప్రత్యేకమైన ప్రాధాన్యత ఉంది. అయితే ఆషాఢ శుద్ధ ఏకాదశిగా వచ్చే తొలి ఏకాదశికి అత్యంత విశిష్టమైన స్థానం ఉంది. దీనినే శయన ఏకాదశి, దేవశయన ఏకాదశి, హరిశయన ఏకాదశి అని కూడా పిలుస్తారు.ఈ రోజున శ్రీమహావిష్ణువు క్షీరసాగరంలో యోగనిద్రలోకి ప్రవేశిస్తాడని పురాణాలు వివరిస్తాయి. అందుకే ఈ రోజు నుంచి ప్రారంభమయ్యే నాలుగు నెలలను చాతుర్మాస్యంగా భావించి దేవాలయాల్లో, మఠాల్లో ప్రత్యేక పూజలు, దీక్షలు నిర్వహిస్తారు.తెలుగు సంప్రదాయంలో తొలి ఏకాదశి నుంచి వరుసగా వచ్చే వరలక్ష్మీ వ్రతం,శ్రావణ మాస పూజలు,శ్రీకృష్ణ జన్మాష్టమి, వినాయక చవితి, మహాలయ అమావాస్య,దసరా,దీపావళి వంటి శుభ పర్వాల పరంపర ప్రారంభమవుతుందని పెద్దలు చెబుతారు. అందుకే తొలి ఏకాదశిని శుభాలకు శ్రీకారం చుట్టే పర్వదినంగా భావిస్తారు.ఈ ఏడాది తొలి ఏకాదశి జులై 25, శనివారం వచ్చింది. ఏకాదశి తిథి జులై 24 శుక్రవారం ఉదయం 10.08 గంటలకు ప్రారంభమై, జులై 25 శనివారం ఉదయం 11.54 గంటలకు ముగుస్తుంది. హిందూ పంచాంగం ప్రకారం సూర్యోదయ సమయానికి ఏ తిథి ఉంటే అదే రోజు ఆచరించడం ఆనవాయితీ. అందువల్ల ఈసారి శనివారాన్నే తొలి ఏకాదశిగా భక్తులు ఉపవాసాలు,పూజలు నిర్వహించనున్నారు.పురాణాల ప్రకారం ఆషాఢ శుద్ధ ఏకాదశి రోజున శ్రీమహావిష్ణువు యోగనిద్రలోకి ప్రవేశించి కార్తీక శుద్ధ ఏకాదశి (ఉత్థాన ఏకాదశి) నాడు మేల్కొంటాడని విశ్వసిస్తారు.ఈ నాలుగు నెలల్లో వివాహాలు, గృహప్రవేశాలు వంటి శుభకార్యాలను సాధారణంగా నిర్వహించరు. ఆధ్యాత్మిక సాధన, జపం, ధ్యానం, దానధర్మాలకు ఈ కాలాన్ని అత్యంత అనుకూలంగా భావిస్తారు.తొలి ఏకాదశి రోజున ఉపవాసం ఉండి శ్రీమహావిష్ణువు, మహాలక్ష్మీ దేవిని భక్తిశ్రద్ధలతో పూజిస్తే సకల పాపాలు నశించి ఆయురారోగ్యాలు, ఐశ్వర్యం,సంతాన సౌభాగ్యం, కుటుంబ సుఖశాంతులు కలుగుతాయని విశ్వాసం.ఈ రోజున విష్ణు సహస్రనామ పారాయణం, భగవద్గీత పఠనం, హరి నామస్మరణ చేయడం విశేష ఫలితాన్ని ఇస్తుందని పండితులు పేర్కొంటున్నారు.తులసి దళం లేకుండాశ్రీమహావిష్ణువు పూజ పూర్తి కాదని ఆగమ శాస్త్రాలు చెబుతున్నాయి. అందువల్ల పూజలో తులసి ఆకులను తప్పనిసరిగా సమర్పిస్తారు. అయితే ఏకాదశి రోజున తులసి మొక్క నుంచి కొత్త ఆకులు కోయకుండా, ముందురోజే తీసి భద్రపరచిన తులసిని ఉపయోగించడం సంప్రదాయం.తొలి ఏకాదశి రోజున దానధర్మాలకు కూడా విశేష ప్రాధాన్యత ఉంది.ధనం,ధాన్యం, వస్త్రాలు,పండ్లు,అన్నదానం చేయడం ద్వారా పుణ్యఫలం లభిస్తుందని విశ్వాసం.కొత్త వస్త్రాలను కొనుగోలు చేసి దేవుని సన్నిధిలో ఉంచి పూజించిన తర్వాత వాటిని పేదలకు లేదా పెద్దలకు దానంగా ఇవ్వడం శుభప్రదంగా భావిస్తారు. ఈ విధంగా చేయడం వల్ల కుటుంబంలో సిరిసంపదలు, ఆరోగ్యం, ఐకమత్యం పెరుగుతాయని పెద్దలు చెబుతారు.ఉపవాసం పాటించే భక్తులు తెల్లవారుజామునే లేచి తలస్నానం చేసి పరిశుభ్రమైన వస్త్రాలు ధరించాలి.శ్రీమహావిష్ణువుకు పంచామృతాభిషేకం, తులసి దళాలు, పూలతో అర్చన చేసి నైవేద్యం సమర్పించాలి. రోజంతా హరి నామస్మరణలో గడిపి,సాయంత్రం దీపారాధన చేయడం ఉత్తమంగా భావిస్తారు.ఉపవాసం చేయలేని వారు సాత్వికాహారం మాత్రమే తీసుకోవాలని ఆధ్యాత్మిక వేత్తలు సూచిస్తున్నారు.అలాగే ఈ రోజున మాంసాహారం, మద్యం, ఉల్లి,వెల్లుల్లి వంటి తామసిక ఆహారాలకు పూర్తిగా దూరంగా ఉండాలి.అసత్యం మాట్లాడడం, కోపం, పరులను అవమానించడం,చెడు ఆలోచనలు చేయడం,గోళ్లు లేదా వెంట్రుకలు కత్తిరించడం వంటి పనులను నివారించాలి.పెద్దలను గౌరవించడం,అవసరమైన వారికి సహాయం చేయడం, దయా గుణంతో వ్యవహరించడం తొలి ఏకాదశి ఆచరణలో ముఖ్యమైన భాగమని పండితులు చెబుతున్నారు.ఆధునిక జీవనశైలిలో పండుగలు కేవలం ఆచారాలకే పరిమితం కాకుండా మన సంస్కృతి, కుటుంబ బంధాలు, ఆధ్యాత్మిక విలువలను గుర్తు చేసే సందర్భాలుగా నిలుస్తున్నాయి. అలాంటి పవిత్రమైన తొలి ఏకాదశి రోజున భక్తి, నియమం, దానం, సేవాభావంతో శ్రీహరిని ఆరాధిస్తే జీవితంలో సుఖశాంతులు, ఐశ్వర్యం,మానసిక ప్రశాంతత కలుగుతాయని భక్తుల విశ్వాసం. అందుకే తెలుగు రాష్ట్రాల్లోని విష్ణు ఆలయాలు తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేక అలంకరణలు,అభిషేకాలు, సహస్రనామా ర్చనలు,భజనలు,అన్నదాన కార్యక్రమాలతో భక్తులతో కిటకిటలాడనున్నాయి.




## పేద కుటుంబాల ఉసురు: బొలెరో ప్రమాద

# బాధితులకు దక్కని న్యాయం, వైద్యం..

**కట్లతోనే కదనం, పేదల ఉసురు తగులుతుంది..**

**నందికొట్కూరు (మన ప్రజాశక్తి):-**

మా మీదే మా కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి సార్... మేము లేకపోతే మా పిల్లలు అనాథలైపోతారు బొలెరో ప్రమాదంలో గాయపడి మంచానికి పరిమితమైన కూలీల గుండెకోత ఇది. రోజువారీ కూలీతో బతికే 15 పేద కుటుంబాలు నేడు రోడ్డున పడ్డాయి. నంద్యాల జిల్లా నందికొట్కూరు మండలం శాతనకోట వద్ద గత శనివారం కూలీలతో వెళ్తున్న బొలెరో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో 15 మంది కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. ఐదుగురికి ఆపరేషన్లు జరగ్గా పది మంది కర్నూలు ప్రభుత్వ సర్వజనాసుపత్రిలో చికిత్స పొంది గాయాలతో ఉన్నారు.ఈ కూలీలంతా రోజుకు 300-400 రూపాయల కోసం పొలం పనులకు వెళ్లే నిరుపేదలు. చేతులు కాళ్లు విరిగి పని చేయలేని స్థితిలో ఉన్నారు.ఇంట్లో బియ్యం గింజ లేదు.పిల్లలు ఆకలితో ఏడుస్తున్నారు.అప్పు ఇచ్చేవాళ్లు కూడా లేరు. బొలెరో వాహనం యజమాని ఒక్క రూపాయి కూడా ఇవ్వలేదు అంటూ తలకు చేతులకు కట్లతో మంచంపై పడి ఉన్న మహిళా కూలీ కన్నీరుమున్నీరైంది.ప్రమాదం జరిగి 6 రోజులు గడుస్తున్నా బొలెరో యజమాని కనీసం పరామర్శించలేదు సరికదా తానే కర్నూలులోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నానంటూ మెడికల్ సర్టిఫికెట్ సమర్పించి పోలీసుల నుంచి తప్పించుకునే ప్రయత్నం చేస్తున్నాడని బాధితులు ఆరోపించారు.న్యాయం జరగకపోవడంతో మంగళవారం గాయపడిన కూలీలంతా కట్లతోనే యజమాని ఇంటిని ముట్టడించారు.కలెక్టర్ సార్ ఎస్పీ సార్ మాకు న్యాయం చేయండి. మా మీదే మా కుటుంబాలు ఆధారపడి ఉన్నాయి. మేము పనికి పోకపోతే మా పిల్లలు పస్తులుండాలి. వైద్యానికి డబ్బులు లేక ఇబ్బంది పడుతున్నాం. దొంగ సర్టిఫికెట్ ఇచ్చిన యజమానిపై కఠిన చర్యలు తీసుకొని, మాకు పరిహారం ఇప్పించండి అని బాధితులు వేడుకున్నారు. తమకు తగిన న్యాయం జరిగి, పరిహారం అందే వరకు యజమాని ఇంటి వద్దనే ఉంటామని, వదిలిపెట్టేది లేదని కూలీలు స్పష్టం చేశారు.






రోజువారీ కూలీపై ఆధారపడిన ఈ 15 పేద కుటుంబాలను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు. బొలెరో ప్రమాదంలో గాయపడి మంచాన పడ్డ కూలీ మహిళ. తలకు, చేతికి కట్లతో నరకయాతన పడుతున్న బాధితురాలు. కుటుంబ పోషణ భారంగా మారడంతో న్యాయం కోసం యజమాని ఇంటి ముందు బైఠాయించిన పేద కూలీలు. చుట్టూ ఆవేదనతో బంధువులు.మేము రోజూ కూలీ చేసుకుని బతికే పేద వాళ్లం సార్.ఇప్పుడు చేతులు, కాళ్లు విరిగి మంచానికి పరిమితమయ్యాం. ఇంట్లో పిల్లలకు పెట్టడానికి తిండి లేదు. అప్పు పుట్టే మార్గం లేదు. యజమాని పట్టించుకోవడం లేదు. మా మీదే మా కుటుంబాలు బతుకుతున్నాయి. అధికారులు దయచూపి మాకు న్యాయం చేయండి బాధిత కూలీల ఆవేదన.

# నీట్ పేపర్ లీకేజ్ కి బాధ్యత వహిస్తూ ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలి

**డి.వై.ఎఫ్.ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్‌లి**

**మన ప్రజాశక్తి ఆలేరు మండలం జూలై 24.2026**

దేశవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తున్న నీట్ పేపర్ లీకేజీకి కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ ప్రధాన బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని డివైఎఫ్ఐ, ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఆలేరు అండర్ పాస్ చౌరస్తాలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా డివైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గడ్డం వెంకటేష్, ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కాసుల నరేష్ మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత 27 పేపర్ లీకులు జరిగాయని వీటన్నిటికీ నైతిక బాధ్యత వహించవలసిన కేంద్ర బిజెపి ప్రభుత్వం విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడుతూ కష్టపడి చదివి డాక్టర్లుగా రాణించాలని నీట్ పరీక్ష రాస్తే ఈ బిజెపి హయాంలో పేపర్ లీక్ కావడానికి ప్రధాన బాధ్యత కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహిస్తూ రాజీనామా చేయాలని ఇప్పటికే నీట్ పేపర్ లీకేజీ పై దేశ రాజధాని ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద ప్రముఖ పర్యావరణ వేత్త సోనం వాంగ్ చుక్ 20 రోజులపాటు దీక్ష చేయగా ఢిల్లీ పోలీసులు అక్కడి బిజెపి ప్రభుత్వం బలవంతంగా అరెస్ట్ చేయడాన్నీ తీవ్రంగా ఖండిస్తున్నామని, కనీసం విద్యార్థులకు న్యాయం చేయకుండా విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతున్న బిజెపి ప్రభుత్వానికి రానున్న కాలంలో విద్యార్థులు, నిరుద్యోగులు తగిన గుణపాఠం చెప్పవలసిన సమయం వస్తుందని ప్రధానంగా బిజెపి హయాంలోనే పేపర్ లీకులు కావడం, విద్యావ్యవస్థ పూర్తిగా భ్రష్టు పట్టిపోయిందని దీనికి ప్రధాని నరేంద్ర మోడీ, విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహించాలని సామరస్యంగా చలో పార్లమెంటు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విద్యార్థులపై నిరుద్యోగులపై ఢిల్లీ పోలీసులు, రాజకీయ గుండాలు అమానుషంగా దాడి చేయడం వందలాది మంది




విద్యార్థులను గాయపర్చడం బిజెపి ప్రభుత్వ నిరంకుషానికి నిదర్శనంగా కనిపిస్తుందని వారు అన్నారు. వెంటనే ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని వారు డిమాండ్ చేశారు ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష కార్యదర్శులు యాసారపు ప్రసాద్, మోరిగాడి పృధ్వి, డివైఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు వడ్డెమాను విప్లవ్, ఎస్ఎఫ్ఐ నాయకులు మద్దెల సాయి గణేష్, సాధం శ్రీనాథ్, లతీఫ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు

# విద్యార్థులకు మద్దతుగా బీఎస్పీ ఆధ్వర్యంలో నిరసన

**విద్యార్థులకు లాఠీల దెబ్బలు కాదు- న్యాయం కావాలి- అధ్యక్షులు ఇబ్రహీం శేఖర్ నీట్ పేపర్ లీకేజీలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి...**

**హైదరాబాద్ జూలై 24, మన ప్రజాశక్తి**



ఢిల్లీలో సుమారు 26 రోజులుగా ప్రజాస్వామ్యబద్ధంగా, రాజ్యాంగబద్ధంగా నిరసన దీక్ష చేస్తున్న విద్యార్థులకు,కాక్రోచ్ జనతా పార్టీ కి బహుజన్ సమాజ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర యూనిట్ సంపూర్ణ మద్దతు ప్రకటిస్తోందని బీఎస్పీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు ఇబ్రహీం శేఖర్, ఆధ్వర్యంలో హైదరాబాద్ లో పార్టీ జరిగిన శాంతియుతంగా నిరసన చేశారు. ఈ సందర్భంగా ఇబ్రహీం శేఖర్ మాట్లాడుతూ... విద్యార్థులపై జాతీయ భద్రతా చట్టం (ఎన్.ఎస్.ఏ) ప్రయోగించడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. ఎలాంటి నేరచరిత్ర లేని విద్యార్థులపై ఇలాంటి కఠిన చట్టాలను ప్రయోగించడం ప్రజాస్వామ్య హక్కులపై దాడి అని పేర్కొన్నారు నీట్ సహా పోటీ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీలకు నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని, దేశవ్యాప్తంగా విద్యార్థుల్లో నెలకొన్న ఆందోళనలకు నైతిక బాధ్యత వహిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ కూడా బాధ్యత వహించాలని డిమాండ్ చేశారు. పేపర్ లీకేజీల వల్ల లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు నాశనమవుతోందని, కొంతమంది విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడే దుస్థితి ఏర్పడిందని అన్నారు. పేపర్ లీకేజీలకు కారణమైన వారిపై కఠిన చర్యలు తీసుకోకుండా కేవలం ఫాస్ట్‌ట్రాక్ కోర్టుల పేరుతో సమస్యను సాగదీయడం సరికాదన్నారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న విద్యార్థులపై లాఠీచార్జ్ చేసిన పోలీసులను తక్షణమే సస్పెండ్ చేసి, వారిపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని, ఈ ఘటనపై సమగ్ర విచారణ జరపాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 19(1)(ఎ), 19(1)(బి) కల్పించిన వాక్ స్వాతంత్ర్యం, శాంతియుత సమావేశాల హక్కులను ప్రభుత్వాలు గౌరవించాలని అన్నారు. తెలంగాణ రాష్ట్రంలో గతంలో (టి.ఎస్.పిఎస్.సి) పేపర్ లీకేజీలపై ఆందోళన చేసిన కాంగ్రెస్ పార్టీ, అధికారంలోకి వచ్చిన తర్వాత బాధ్యులపై తీసుకున్న చర్యలపై ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు పేపర్ లీకేజీల విషయంలో ద్వంద్వ ప్రమాణాలను విడనాడాలని అన్నారు. దేశంలో సనాతనం పేరుతో రాజకీయాలు కాకుండా, విద్యా విధానం, సైన్స్ టెంపర్, ప్రపంచంతో పోటీ పడే విద్యా వ్యవస్థపై చర్చ జరగాలని ఇబ్రహీం శేఖర్ డిమాండ్ చేశారు.

**విద్యార్థులకు లాఠీలు కాదు---న్యాయం కావాలి.**

**పేపర్ లీకేజీలు కాదు-పారదర్శకమైన పరీక్షలు కావాలి.**

**విద్యా వ్యవస్థను ప్రక్షాళన చేయాలి.**

ఈ కార్యక్రమం లో రాష్ట్ర ఉపాధ్యక్షులు శ్రీరాం కృష్ణ,ప్రధాన కార్యదర్శులు ఈశ్వర్,ధర్మేందర్,బానోత్ రవీందర్ నాయక్, దయానంద్ రావు, జిల్లాల నాయకులు, బండారి శ్రీనివాస్ ,మల్లెపోగు విజయ్ రాజ్ ,దొడ్డి శ్రీనివాస్ , మరియు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.

# విద్యార్థులపై దాడులు ఆపాలి.. కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామా చేయాలి

**నీట్ అక్రమాలపై నల్లగొండలో విద్యార్థి సంఘాల రాస్తారోకో.. పార్లమెంట్‌లో చర్చకు డిమాండ్**

**నల్లగొండ టౌన్, జులై 24 ( మన ప్రజాశక్తి ):**









నీట్ పరీక్షలో జరిగిన అక్రమాలకు బాధ్యత వహిస్తూ కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంత్రి రాజీనామా చేసే వరకు తమ ఆందోళనలు కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

నల్లగొండ పట్టణంలోని గడియారం సెంటర్‌లో ఎస్ఎఫ్ఐ, పీడీఎస్‌యూ, ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఎఫ్, డీవైఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి రాస్తారోకో నిర్వహించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ జిల్లాకేంద్రంలో నిర్వహించిన బంద్ విజయవంతమైందని తెలిపారు.

నీట్ పరీక్ష నిర్వహణలో జరిగిన లోపాల వల్ల దేశవ్యాప్తంగా లక్షలాది మంది విద్యార్థులు నష్టపోయారని, పలువురు విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దెబ్బతీసిన ఈ ఘటనపై కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించాలని కోరారు.

నీట్ ప్రశ్నపత్రం లీకేజీ అంశంపై పార్లమెంట్‌లో సమగ్రంగా చర్చ నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వం, ప్రధానమంత్రి మౌనం వహించడం బాధాకరమని విమర్శించారు. శాంతియుతంగా నిరసన వ్యక్తం చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు, మేధావులు, సామాజిక కార్యకర్తలపై బలప్రయోగానికి పాల్పడడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని పేర్కొన్నారు.

మరణించిన విద్యార్థుల కుటుంబాలను కేంద్ర ప్రభుత్వం ఆదుకుని, ఒక్కో కుటుంబానికి రూ.1 కోటి చొప్పున నష్టపరిహారం ప్రకటించాలని కోరారు. నిరసన వ్యక్తం చేసిన విద్యార్థులపై జరిగిన లాఠీచార్జికి ప్రధానమంత్రి పార్లమెంట్ వేదికగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల సమస్యలను నిర్లక్ష్యం చేస్తే ప్రభుత్వానికి ప్రజలే తగిన గుణపాఠం చెబుతారని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లం మహేష్, ఎస్ఎఫ్ఐ నాయకులు ఖమ్మంపాటి శంకర్, ఇందూరి సాగర్, ముదిగొండ మురళీకృష్ణ, అంజన్‌కుమార్ యాదవ్, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జాను, జిల్లా కార్యదర్శి పవన్, ఎస్ఎఫ్ఐ నాయకులు మరుపాక కిరణ్, నవదీప్, ఆదిల్, యశ్వంత్, యువరాజ్‌తో పాటు ఎన్ఎస్‌యూఐ, ఏఐఎస్ఎఫ్ నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# పట్టించుకునే నాథుడే లేడు..!

**పిచ్చిమొక్కలతో అడవిని తలపిస్తున్న మరిపెడ మున్సిపల్ పార్క్**

**డోర్నకల్ /మరిపెడ మన ప్రజాశక్తి జులై 24 :-**

ప్రజల సేదతీరు, ఆరోగ్య పరిరక్షణ కోసం కోట్లాది రూపాయల ప్రజాధనంతో నిర్మించిన మరిపెడ మున్సిపల్ పార్క్ ప్రస్తుతం అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనంగా మారింది. నిర్వహణ లోపంతో పార్క్ మొత్తం పిచ్చిమొక్కలు, పొడవైన గడ్డి, కంపచెట్లతో నిండిపోయి అడవిని తలపించేలా మారింది. అవసరమైన అన్ని సదుపాయాలు ఉన్నప్పటికీ సరైన నిర్వహణ లేక ప్రజలకు ఉపయోగపడకుండా పోవడంపై స్థానికులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ఆట స్థలాన్ని ఆక్రమించిన పిచ్చిగడ్డి..**

**భయాందోళనలో చిన్నారులు**

పిల్లల వినోదం కోసం ఏర్పాటు చేసిన ఉయ్యాలలు, జారుడు బల్లలు తదితర ఆట పరికరాల పరిసరాలు మోకాళ్ల లోతు పిచ్చిగడ్డి, పొదలతో కప్పుకుపోయాయి. దీంతో చిన్నారులు పార్కులోకి వెళ్లేందుకు సైతం భయపడుతున్నారు. పాములు, తేళ్లు వంటి విషజంతువులు సంచరించే ప్రమాదం ఉందనే ఆందోళనతో తల్లిదండ్రులు పిల్లలను పార్కుకు తీసుకురావడానికే వెనుకాడుతున్నారు. సాయంత్రం వేళల్లో ఆహ్లాదంగా గడపాలని వచ్చే చిన్నారులకు నిరాశే మిగులుతోంది.

**తుప్పుపడుతున్న ఓపెన్ జిమ్ పరికరాలు**

ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకుని ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్ పరికరాలు నిర్వహణ లేక నిరుపయోగంగా మారుతున్నాయి. చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగిపోవడం, పరికరాలకు సరైన సంరక్షణ లేకపోవడంతో అవి తుప్పుపట్టి దెబ్బతింటున్నాయి. ఉదయం వ్యాయామం, వాకింగ్ కోసం వచ్చే వారు ఈ సదుపాయాలను వినియోగించుకోలేక ఇబ్బందులు పడుతున్నారు.

**ఆవేదన వ్యక్తం చేస్తున్న మార్నింగ్ వాకర్స్, స్థానికులు**

"ఉదయం, సాయంత్రం వేళల్లో ప్రశాంతంగా గడిపేందుకు పార్కుకు వస్తుంటాం. కానీ ప్రస్తుతం పార్క్ పరిస్థితి చూస్తే బాధ కలుగుతోంది. కనీసం వాకింగ్ ట్రాక్ పక్కన పెరిగిన గడ్డిని కూడా తొలగించడం లేదు. అధికారులు ఇప్పటికైనా స్పందించి పార్కును అభివృద్ధి చేయాలి" అని మార్నింగ్ వాకర్స్, స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**తక్షణ చర్యలు తీసుకోవాలని డిమాండ్**

మరిపెడ మున్సిపల్ అధికారులు వెంటనే స్పందించి పార్కులో పెరిగిన పిచ్చిగడ్డి, కంపచెట్లను తొలగించడంతో పాటు ఓపెన్ జిమ్ పరికరాలను మరమ్మతులు చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. ప్రజాధనంతో నిర్మించిన ఈ పార్కును పరిరక్షించి, పూర్వ వైభవం తీసుకురావాలని వారు కోరుతున్నారు.









# బాధితులు పోగొట్టుకున్న మొబైల్ ఫోన్లు బాధితులకు అందజేత..





**జిల్లా ఎస్పీ సునిత రెడ్డి**

**ఉమ్మడి మహబూబ్ నగర్ బ్యూరో జూలై 24**

లశుక్రవారం రోజున జిల్లా పోలీసు కార్యాలయం సమావేశ భవనంలో మొబైల్ ఫోన్ రికవరీ మేళా ఏర్పాటు చేసి జిల్లాలో ప్రజలు వివిధ బాధితులు దాదాపు మధ్యతరగతి కుటుంబీకులు, బీదవారు వారు ఎంతగానో కష్టపడి కొనుకుని వివిధ రూపాల్లో పోగొట్టుకున్న, దొంగలించబడిన, మొబైల్ ఫోన్లను తిరిగి సంపాదించడం కోసం జిల్లా ఎస్పీ శ్రీమతి సునిత రెడ్డి, ఐపీఎస్. ప్రత్యేక చొరవతో వనపర్తి సిసిఎస్ సీఐ, పవార్ అశోక్ కుమార్ ఆధ్వర్యంలో వనపర్తి జిల్లాలోని కొత్తకోట, వనపర్తి, ఆత్మకూరు, 3సర్కిళ్ళ నుంచి 10మంది అధికారుల సిబ్బందితో కలిసి 3 ప్రత్యేక రికవరీ బృందాలను ఏర్పాటు చేసి నెల రోజుల వ్యవధిలో దాదాపు వివిధ రాష్ట్రాల నుండి జిల్లాలో మొబైల్ ఫోన్లను రికవరీ చేసి పోగొట్టుకున్న, చోరీకి గురైనటువంటి బాధితులకు 236 మొబైల్ ఫోన్లు (దాదాపు 65 లక్షల విలువ చేసే ) వివిధ ప్రాంతాల నుండి తెప్పించి బాధితులకు తిరిగి అందజేశారు, అట్టి మొబైల్ ఫోన్లు, తెలంగాణ -196 (ఫోన్లు), ఆంధ్రప్రదేశ్ -15, కర్ణాటక- 08 , కేరళ-02 , మధ్యప్రదేశ్-06, మహారాష్ట్ర -- 09 , రాష్ట్రాల నుండి ఈ మొబైల్స్ ను రికవరీ చేశారు. జిల్లాలో ఈ సంవత్సరం ఇప్పటివరకు 500 మొబైల్ ఫోన్లను బాధితులకు తిరిగి అందజేయడం జరిగింది. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందని పోగొట్టుకున్నటువంటి మొబైల్ ఫోన్లను తిరిగి రాబట్టి బాధితులకు అందజేయడం జరుగుతుందని ఎస్పీ హామీ ఇచ్చారు. బాధితులు మొబైల్ ఫోన్లు పోగొట్టుకున్న వెంటనే పోలీస్ స్టేషన్ను సంప్రదించాలని ఫిర్యాదుకు ఎలాంటి మీసేవ సెంటర్లలో చలాన్లు కట్టవలసిన అవసరం లేదని తెలిపారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ... ప్రస్తుత రోజుల్లో మొబైల్ ఫోన్ ప్రతి ఒక్కరికీ నిత్యవసరమైనది, దీనిని కమ్యూనికేషన్ కోసం, ఆన్లైన్ విద్య కోసం వినియోగిస్తున్నాం, మన యొక్క విలువైన సమాచారం బ్యాంక్ అకౌంట్స్, పాస్ వర్డ్స్, సోషల్ మీడియా అకౌంట్స్, వ్యక్తిగత ఫోటోలు మొదలైన వంటివి ఫోన్ లో నిక్షిప్తం చేసుకుంటున్నాము అన్నారు, మొబైల్ చోరికి గురైనా, పోగొట్టుకున్నా అందులో ఉన్న సమాచారం పోతుంది. నేరగాళ్లు మొబైల్ దొంగిలించి, వీక్ పాస్ వర్డ్స్ లను బ్రేక్ చేసి ఫోన్ పే, గూగుల్ పే తదితర మధ్యమాల ద్వారా డబ్బులు కాజేస్తున్నారన్నారు. మొబైల్ ఫోన్ పోగొట్టుకున్న వ్యక్తులు కేవలం మొబైల్ ఫోన్ మాత్రమే కాకుండా తమ వ్యక్తిగత సమాచారంతో సహ డబ్బులను కూడా కోల్పోవడం జరుగుతున్నారు. సెల్ ఫోన్ దొంగతనాల నుండి విముక్తి కల్పించడానికై (డిపార్ట్మెంట్ ఆఫ్ టెలి-కమ్యూనికేషన్) సీఈఐ ఆర్ పోర్టల్ ను అందుబాటులోకి తీసుకురావడం జరిగింది. ఈపోర్టల్ ద్వారా మంచి ఫలితాలు రాబట్టడం జరుగుతుందని ఎస్పీ గారు వివరించారు. ఒక్కో మొబైల్ రికవరీ చేయడానికి సైబర్ వారియర్స్ పోలీస్, టెక్నికల్ టీం పోలీసు సిబ్బంది చాలా కృషి చేశారు. పోలీసు ప్రజల ఆస్తుల రక్షణలో అనుక్షణం ప్రజల పక్షాన పని చేస్తుంది, తప్పుడు ప్రవర్తన కలిగిన వ్యక్తులకు, నేరాలకు పాల్పడే వారికి ఫ్రెండ్లీ పోలీస్ ఉండదు, సామాన్యుల పట్ల మాత్రమే ఫ్రెండ్లీ పోలీస్ అన్నారు. ఎవరైన మొబైల్ పోగొట్టుకున్న లేదా దొంగిలించబడిన వెంటనే పోర్టల్ నందు నమోదుచేసి , సంభందిత పోలీసు స్టేషన్ లో సమాచారం ఇచ్చి మొబైల్ ను బ్లాక్ చేయించాలన్నారు. ప్రజలు, వినియోగదారులు ఎవరైనా సెకండ్ హ్యాండ్ మొబైల్ ఫోన్ లను కొనుగోలు చేసినట్లైతే అట్టి షాప్ యజమాని నుండి రసీదు తప్పనిసరిగా తీసుకోవాలని సూచించారు. సెల్ ఫోన్ దొంగలు దొంగిలించిన ఫోన్ లను మొబైల్ షాప్ లలో అమ్ముతున్నారని, తక్కువ ధరకు వస్తుందని దొంగిలించబడిన ఫోన్ అని తెలియక కొనుగోలు చేసి అమాయక ప్రజలు మోసాలకు గురి అవుతున్నారని అన్నారు. ఎవరైన దొంగిలించబడిన ఫోన్ అని తెలిసి కూడా కొనుగోలు చేసినట్లైతే అట్టి వ్యక్తులపై క్రిమినల్ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. పోలీసుశాఖ కృత నిచ్చయంతో పనిచేసి ఈరోజు పెద్దమొత్తంలో ఫోన్స్ రికవరీ చేసి ఇక్కడ భాదితులకు అందించడం జరిగినది ఎస్పీ గారు అన్నారు. పోలీసుశాఖకు ధన్యవాదాలు తెలిపిన మొబైల్స్ పొందిన బాధితులు.. పోయిన మొబైల్ ఫోన్లు మళ్లీ దొరకదనుకున్న బాధితులు జిల్లా పోలీసులు టెక్నాలజీ ఉపయోగించి ఫోన్ రికవరీ చేసి అందించినందుకు సంభందిత బాధితులు జిల్లా ఎస్పీ గారికి, పోలీస్ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ చోరీ మొబైల్స్ రికవరీలో ప్రతిభ చూపిన సీసీఎస్, పోలీసు మరియు ప్రత్యేక పోలీసు బృందాలు సిసిఎస్ సీఐ, పవార్ అశోక్ కుమార్, ఎస్సై, రామరాజు, ఏఎస్సై, తిరుపతిరెడ్డి, హెడ్ కానిస్టేబుళ్లు: ఎన్.రాజగౌడ్, శ్రీనివాస్ రెడ్డి, కృష్ణయ్య, బాలయ్య, రాఘవేందర్, కానిస్టేబుళ్లు: బెద్దడి స్వామి, మురళి కృష్ణ, సమరసింహారెడ్డి, మురళి, సత్యనారాయణ, భూపాల్ లను ఎస్పీ క్యాష్ రివార్డ్ అందజేసి ప్రత్యేకంగా అబినధించారు. ఈ కార్యక్రమంలో వనపర్తి డిఎస్పీ, గిరిబాబు, వనపర్తి డిసిఆర్బీ డిఎస్పీ, బాలాజీ నాయక్, సిసిఎస్ సీఐ, పవార్ అశోక్ కుమార్, స్పెషల్ బ్రాంచ్ సీఐ, నరేష్, వనపర్తి సీఐ, సుగంధర రత్నం, కొత్తకోట సీఐ, రాంబాబు, ఆత్మకూరు సీఐ, శివకుమార్, వనపర్తి సిసిఎస్ ఏఎస్సై, తిరుపతి రెడ్డి, ప్రత్యేక బృందం పోలీసు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## డ్రగ్స్ నిరోధానికి కఠిన నిబంధనలు తీసుకురావాలి:

# సీఎం రేవంత్ ఆదేశం

**హైదరాబాద్, జులై 24:**

డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపేందుకు కఠిన నిబంధనలు తీసుకురావాలని ఉన్నతాధికారులను తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశించారు. డ్రగ్స్ నిరోధంపై ప్రభుత్వం సీరియస్‌గా దృష్టి సారించింది. ఈ నేపథ్యంలో శుక్రవారం హైదరాబాద్‌లో రాష్ట్రంలో మాదక ద్రవ్యాల నిరోధం, భద్రత కమిటీలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి పలు కీలక సూచనలు చేశారు. విద్యా సంస్థల్లో డ్రగ్స్ నియంత్రణకు సంబంధించి ఆయా సంస్థల యాజమాన్యాలను బాధ్యులను చేయాలని స్పష్టం చేశారు. క్యాంపస్ లోపల డ్రగ్స్‌కు సంబంధించి ఏ ఘటనకైనా యాజమాన్యాన్నే బాధ్యులను చేయాలని సూచించారు. డ్రగ్స్ విషయంలో క్యాంపస్ బయట జరిగే యాక్టివిటీని గుర్తించి సమాచారాన్ని అందించే వ్యవస్థను ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. విద్యాసంస్థలకు అధికారంతో పాటు బాధ్యతను అప్పగించాలని తెలంగాణ సీఎం పేర్కొన్నారు. విద్యార్థుల ప్రవర్తనలో మార్పులను గుర్తించేందుకు యాజమాన్యాలు ప్రత్యేక విభాగాన్ని ఏర్పాటు చేసుకునేలా చూడాలని అన్నారు. డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం అందించేందుకు విద్యాసంస్థల ఆవరణలో టోల్ ఫ్రీ



నెంబర్, ప్రత్యేక క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేసే అంశాన్ని పరిశీలించాలని ఉన్నతాధికారులకు స్పష్టం చేశారు. గుర్తించడం, మాన్పించడం, శిక్షించడం.. ఈ మూడు దశలను సమర్ధవంతంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సీఎం తెలిపారు. డ్రగ్స్ స్వీకరించి పట్టుబడితే డీ-అడిక్షన్ సెంటర్‌కు తరలించాలని అన్నారు. తరచూ పట్టుబడితే కఠినంగా శిక్షించే అంశాన్ని కూడా పరిశీలించాలని సూచించారు. డ్రగ్స్ విషయంలో కఠినంగా వ్యవహరించేందుకు అవసరమైతే చట్టాన్ని రూపొందించే అంశంపై అధ్యయనం చేయాలని అధికారులకు తెలంగాణ సీఎం రేవంత్ స్పష్టం చేశారు.

# ఎల్ నినోతో తెలంగాణలో వర్షాభావం..




**హైదరాబాద్, జులై 24:**

దేశంలో ఎల్ నినో ప్రభావం తీవ్రంగా ఉన్న రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు వెల్లడించారు. శుక్రవారం హైదరాబాద్‌లో ఎల్ నినోపై వివిధ శాఖల ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. తెలంగాణలో 27 శాతం వర్షపాతం లోటు ఉందని వివరించారు. రాష్ట్రంలో కేవలం 7 జిల్లాల్లోనే సాధారణ వర్షపాతం నమోదు అయిందని తెలిపారు. 385 మండలాల్లో లోటు వర్షపాతం నమోదు అయినట్లు చెప్పారు. రైతులకు వాట్సాప్ ద్వారా వాతావరణ సమాచారం అందిస్తామని పేర్కొన్నారు. తాగు నీరు కోసం రిజర్వాయర్లలో నీటి నిల్వలకు ప్రాధాన్యం ఇస్తు?న్నామని అన్నారు. వరి సాగుకు బదులు ప్రత్యామ్నాయ పంటలు వేయాలని రైతులకు సూచించారు. ప్రత్యామ్నాయ పంటలకు కనీస మద్దతు ధర (మీఎ్రా) ఉందని.. ఈ అంశంపై రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆయన ఆదేశించారు. రాష్ట్రంలో వరి సాగు ఇప్పటి వరకు 24 శాతం కంటే తక్కువ నమోదు అయిందని అన్నారు. సెప్టెంబరులోనూ తక్కువ వర్షాలు కురిసే అవకాశం ఉందని భారత వాతావరణ విభాగం వెల్లడించిన విషయాన్ని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ఈ సీజన్‌లో ఫామ్ పాండ్స్ నిర్మాణం విస్తృతంగా చేపట్టాల్సి ఉందన్నారు. ప్రతి 45 రోజులకు మండల స్థాయిలో సమీక్షా సమావేశాలు నిర్వహించాలని క్షేత్ర స్థాయిలోని అధికారులకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు స్పష్టం చేశారు.

## ఢిల్లీ ఆందోళనల తీవ్రత

# చార్మినార్ వద్ద ప్రతిధ్వనించింది.. !!

**హైదరాబాద్,జూలై24**

ఢిల్లీలో విద్యార్థులపై ఇటీవల జరిగిన పోలీసుల లాఠీఛార్జీ ప్రభావం హైదరాబాద్‌లో కనిపించింది. చారిత్రక చార్మినార్ వద్ద నిరసన జ్వాలలు ఎగిసిపడ్డాయి. స్టూడెంట్స్ ఇస్లామిక్ ఆర్గనైజేషన్ ఆఫ్ ఇండియా తెలంగాణ విభాగం ఇచ్చిన పిలుపు మేరకు.. శుక్రవారం మధ్యాహ్నం ప్రత్యేక ప్రార్థనలు ముగిసిన తర్వాత చార్మినార్ పరిసరాల్లో భారీ ప్రదర్శన చేపట్టారు విద్యార్థులు. తమ హక్కుల కోసం రాజీలేని పోరాటం సాగిస్తున్న తోటి విద్యార్థులకు సంఘీభావం ప్రకటిస్తూ ధర్నాలు, ఆందోళనను నిర్వహించారు. మక్కా మసీదులో ప్రార్థనల అనంతరం పెద్ద ఎత్తున ఇస్లామిక్ విద్యార్థులు చార్మినార్ వద్ద గుమికూడారు. కేంద్ర ప్రభుత్వం, పోలీసుల వైఖరిని నిరసించారు. వందలాది మంది విద్యార్థులు పెద్ద సంఖ్యలో ఇందులో పాల్గొన్నారు. ఢిల్లీ ఆందోళనలకు తమ సంఘీభావం ప్రకటించారు. ఈ నిరసన ప్రదర్శన సందర్భంగా వారి నినాదాలతో చార్మినార్ పరిసరాలు ప్రతిధ్వనించాయి. ఢిల్లీ పోలీసుల ఏకపక్ష వైఖరి, విద్యార్థులపై జరిపిన లాఠీఛార్జ్ కు వ్యతిరేకంగా ప్లకార్డులు ప్రదర్శించారు. ఉన్నత విద్యాసంస్థల్లో జరుగుతున్న కుట్రలను తక్షణమే ఆపాలని కేంద్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పోలీసులు తమ






పరిధిని దాటి వ్యవహరించడం ప్రజాస్వామ్య వ్యవస్థలకే ప్రమాదకరమని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రజాస్వామ్యంలో తమ నిరసనను శాంతియుతంగా తెలిపే హక్కు ప్రతి పౌరుడికీ ఉందని, దాన్ని అడ్డుకునే ప్రయత్నాలు చేయవద్దని వారు స్పష్టం చేశారు. విద్యార్థులపై భౌతిక దాడులకు పాల్పడిన పోలీసులపై ఉన్నత స్థాయి విచారణ జరిపించి కఠిన చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సంఘీభావ ప్రదర్శన ఏ ఒక్క ప్రాంతానికో లేదా ఏ ఒక్క రోజుకో పరిమితమైనది కాదని విద్యార్థి సంఘాల నాయకులు స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా విద్యా వ్యవస్థల్లో నెలకొన్న వివిధ అణచివేత ధోరణులపై, భవిష్యత్తులో మరింత బలమైన పోరాటాలు సాగిస్తామని వారు ఉద్ఘాటించారు. దేశవ్యాప్తంగా ఉన్న విద్యార్థులందరినీ ఏకతాటిపైకి తెచ్చి, ప్రశ్నించే హక్కును కాపాడుకుంటామని, బాధ్యులకు తగిన శిక్ష పడే వరకు శాంతియుత మార్గంలో తమ ఆందోళనలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. చార్మినార్ వద్ద ఉద్రిక్త పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు జాగ్రత్తగా హైదరాబాద్ నగర పోలీసులు భారీ భద్రతను ఏర్పాటు చేశారు. ఎలాంటి ఘర్షణలు లేదా అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అదనపు బలగాలను మోహరించి పరిస్థితిని పర్యవేక్షించారు.

## ముంబై--హైదరాబాద్ బుల్లెట్ ట్రైన్ కారిడార్.. ఆ జిల్లా నుండి కేంద్రానికి విజ్ఞప్తి!



**హైదరాబాద్,జూలై24**

తెలంగాణా రాష్ట్రంలో బుల్లెట్ రైలు కారిడార్ ల నిర్మాణానికి రూట్ లు, డీపీఆర్ లు తయారు చేసి ప్రతిపాదనలు పంపిన వేళ అప్పుడే బులెట్ రైల్ కారిడార్ లపై విజ్ఞప్తులు కనిపిస్తున్నాయి. ముంబై హైదరాబాద్ మధ్య ప్రతిపాదిత బుల్లెట్ రాలు కారిడార్ మహారాష్ట్రలోని ముంబై, నాసిక్, అహ్మద్ నగర్ తో పాటు తెలంగాణాలోని నిజామాబాద్, సంగారెడ్డి,హైదరాబాద్ వంటి ప్రాంతాలు కవర్ అవుతాయని అంచనా. బుల్లెట్ రైల్ కారిడార్ ప్రారంభం కాకముందే సంగారెడ్డి నుండి కేంద్రానికి విజ్ఞప్తి ఈ క్రమంలో బుల్లెట్ రైల్ కారిడార్ ప్రారంభం కాకముందే సంగారెడ్డి నుండి విజ్ఞప్తి కేంద్రానికి చేరింది. సంగారెడ్డి జిల్లా సమగ్ర అభివృద్ధికి కేంద్ర సహకారం కోరుతూ స్థానిక ప్రజా ప్రతినిధులు ఢిల్లీలో కేంద్రమంత్రితో సమావేశం అయ్యారు. సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్ రావు, బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ ఫ్లోర్ లీడర్ వద్దిరాజు రవి చంద్రలు కేంద్ర రైల్వే శాఖామంత్రి అశ్విని వైష్ణవ్ ను కలిసి మాట్లాడారు. సంగారెడ్డిలో స్టేషన్ ఏర్పాటు చేయాలని మంత్రికి విజ్ఞప్తి ముంబై హైదరాబాద్ ప్రతిపాదిత బుల్లెట్ ట్రైన్ కారిడార్ లో భాగంగా సంగారెడ్డిలో స్టేషన్ ఏర్పాటు చేయాలని మంత్రిని కోరారు. జహీరాబాద్ లో నేషనల్ ఇన్వెస్ట్మెంట్ అండ్ మాన్యుఫ్యాక్చరింగ్ జోన్ మరియు ఇండస్ట్రియల్ స్మార్ట్ సిటీ అవసరాల కోసం బుల్లెట్ ట్రైన్ స్టాప్‌తో పాటు రైల్వే ర్యాక్ పాయింట్ మంజూరు చేయాలని కోరారు. బుల్లెట్ రైలు ప్రాజెక్ట్ పనులు ప్రారంభం కాకముందే ఈ విజ్ఞప్తి రైల్వే మంత్రికి చేరింది. రూ. 1.10 లక్షల కోట్ల అంచనా వ్యయంతో బుల్లెట్ రైల్ కారిడార్ ముంబై నుండి హైదరాబాద్ కు ప్రతిపాదిత హై స్పీడ్ రైలు కారిడార్ సుమారు 700 నుండి 750 కిలోమీటర్ల పొడవు ఉండే అవకాశం ఉంది. ఈ ప్రాజెక్టు ద్వారా ముంబై హైదరాబాద్ మధ్య ప్రయాణ సమయం ఏడు ఎనిమిది గంటల నుండి మూడు గంటలకు తగ్గించాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం 1.10 లక్షల కోట్ల రూపాయలు ఉండవచ్చని రైల్వే శాఖ వర్గాలు చెబుతున్నాయి. జపాన్, ఫ్రాన్స్ వంటి దేశాలు సాంకేతిక సహకారంతో ఈ ప్రాజెక్టును అమలు చేయాలని ప్రతిపాదనలు ఉన్నాయి.

## ఉద్యోగినుల ప్రసూతి సెలవులపై తెలంగాణ హైకోర్టు కీలక తీర్పు




**హైదరాబాద్,జూలై24**

ఉద్యోగినులకు సంబంధించి తెలంగాణ హైకోర్టు అత్యంత కీలకమైన వ్యాజ్యంలో చారిత్రాత్మక తీర్పునిచ్చింది. మొదటి ప్రసవంలో కవల పిల్లలు జన్మించినప్పటికీ, రెండవ ప్రసవానికి కూడా మహిళా ఉద్యోగి పూర్తి స్థాయి ప్రసూతి సెలవులకు అర్హురాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు దాఖలైన రిట్ పిటిషన్‌ను అనుమతిస్తూ, పిటిషనర్‌కు రెండవ ప్రసవానికి గానూ 180 రోజుల ప్రసూతి సెలవులు మంజూరు చేయాలని ధర్మాసనం ఉత్తర్వులు జారీ చేసింది. మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (౧+టాఔ=జు×టా)లో జూనియర్ లెక్చరర్‌గా పనిచేస్తున్న జాడి స్వరూపరాణికి నవంబర్ 2023లో జరిగిన మొదటి ప్రసవంలో కవల పిల్లలు జన్మించారు. నిబంధనల ప్రకారం ఆమె అప్పుడు 180 రోజుల ప్రసూతి సెలవులను వినియోగించుకున్నారు. అయితే, 2026 ప్రారంభంలో ఆమె రెండవసారి గర్భం దాల్చి ప్రసూతి సెలవుల కోసం దరఖాస్తు చేసుకోగా, ఇద్దరి కంటే తక్కువ పిల్లలున్న వారికే సెలవులు వర్తిస్తాయనే 'తెలంగాణ ఫండమెంటల్ రూల్స్ 101(అ)', జిఓ 50 నిబంధనలను బూచిగా చూపుతూ గురుకుల యాజమాన్యం ఆమె దరఖాస్తును తిరస్కరించింది. ఈ వివాదంపై విచారణ చేపట్టిన జస్టిస్ కాజా శరత్ ధర్మాసనం అధికారుల తీరుపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కవల పిల్లలు జన్మించడం అనేది పూర్తి జీవశాస్త్ర పరిణామమని, అది పిటిషనర్ చేతుల్లో లేని అంశమని స్పష్టం చేశారు. ప్రసూతి ప్రయోజనాల దృష్ట్యా కవలలు జన్మించిన మొదటి ప్రసవాన్ని 'ఒకే ప్రసవం'గానే పరిగణించాలని వ్యాఖ్యానించారు. రాజ్యాంగంలోని ఆర్టికల్ 21 ప్రకారం ప్రసూతి సెలవులు పొందడం అనేది ఒక మహిళ ప్రాథమిక హక్కు అని, ఇది ఆరోగ్య రక్షణ, గౌరవప్రదమైన జీవనం మరియు పునరుత్పత్తి హక్కులతో ముడిపడి ఉందన్నారు. సెలవు కాలానికి సంబంధించి పిటిషనర్‌కు పూర్తి జీతం, ఇతర భత్యాలు చెల్లించాలని సంబంధిత ప్రభుత్వ అధికారులను హైకోర్టు ఆదేశించింది. జనాభా నియంత్రణ అనేది ప్రభుత్వ ప్రధాన లక్ష్యమే అయినప్పటికీ, అది మహిళలు మరియు పిల్లల సంక్షేమానికి విఘాతం కలిగించకూడదని కోర్టు గుర్తుచేసింది. మొదటి ప్రసవంలో ఎంతమంది జన్మించారనే సంఖ్య ఆధారంగా రెండవ ప్రసవానికి సెలవులు తిరస్కరించడం రాజ్యాంగ రక్షణలను ఉల్లంఘించడమేనని స్పష్టం చేసింది. ప్రసూతి సమయంలో ఇలాంటి మద్దతు లభించకపోతే ఎంతోమంది మహిళలు తమ ఉద్యోగాలను వదులుకోవాల్సి వస్తుందని ఆందోళన వ్యక్తం చేసింది.

# వైరల్ వీడియో కేసులో తీర్పు: బాలుడికి వినూత్న శిక్ష విధించిన జువైనల్ బోర్డు



**గతేడాది వైరల్ అయిన చాదర్‌ఘాట్ ఆటో వేధింపుల కేసులో తీర్పు**
**నిందితుడైన మైనర్‌కు నెల రోజుల సామాజిక సేవ శిక్ష విధింపు**
**రోజూ ఉదయం 10 నుంచి 2 వరకు జువైనల్ బోర్డులో రిపోర్ట్ చేయాలని ఆదేశం**
**బాలుడిలో సంస్కరణే లక్ష్యంగా జువైనల్ జస్టిస్ బోర్డు ఆదేశాలు**

**హైదరాబాద్,జూలై24**

గతేడాది తెలంగాణవ్యాప్తంగా సంచలనం సృష్టించిన చాదర్‌ఘాట్ ఆటో వేధింపుల కేసులో నాంపల్లి జువైనల్ జస్టిస్ బోర్డు కీలక తీర్పు వెలువరించింది. ఈ కేసులో నిందితుడిగా ఉన్న మైనర్‌కు నెల రోజుల పాటు సామాజిక సేవ (కమ్యూనిటీ సర్వీస్) చేయాలని ఆదేశించింది. నిందితుడిలో బాధ్యతాయుతమైన ప్రవర్తనను పెంపొందించడం, అతడిని సంస్కరించడమే లక్ష్యంగా ఈ తీర్పునిచ్చినట్లు బోర్డు పేర్కొంది.బోర్డు ఆదేశాల ప్రకారం.. సదరు బాలుడు నెల రోజుల పాటు ప్రతిరోజూ ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జువైనల్ జస్టిస్ బోర్డు కార్యాలయంలో హాజరై రిపోర్ట్ చేయాల్సి ఉంటుంది.2023 నవంబర్ 7వ తేదీ రాత్రి, హైదరాబాద్‌లోని చాదర్‌ఘాట్ వంతెనపై కదులుతున్న ఆటోలో (౨+05౪4061) ఒక మహిళను వేధించిన ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఈ వీడియోపై పెద్ద ఎత్తున దుమారం రేగడంతో చాదర్‌ఘాట్ పోలీసులు సుమోటోగా కేసు నమోదు చేశారు. పెట్రోలింగ్ బృందం సమాచారంతో దర్యాప్తు చేపట్టిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకున్నారు. విచారణలో నిందితుడు మైనర్ అని తేలడంతో కేసును జువైనల్ జస్టిస్ బోర్డుకు బదిలీ చేశారు.ఈ కేసు ఫైలును తదుపరి చట్టపరమైన చర్యల కోసం 5వ వీఏసీజేఎం (వాజజీవీ) కోర్టుకు పంపినట్లు చాదర్‌ఘాట్ ఇన్స్‌పెక్టర్ తెలిపారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియపై మంత్రి కోమటిరెడ్డి సమీక్ష



**ఆత్మకూరు: జూలై24**

యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు (ఎం) మండలంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియపై బూత్ లెవల్ అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఓటర్ల జాబితా సవరణలో పూర్తి పారదర్శకత పాటించాలని, అర్హులైన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు లభించేలా అధికారులు బాధ్యతాయుతంగా పనిచేయాలని మంత్రి కోమటిరెడ్డి దిశానిర్దేశం చేశారు. జాబితాలో ఎలాంటి తప్పులకు ఆస్కారం లేకుండా క్షేత్రస్థాయిలో నిశితంగా పరిశీలన జరపాలని, ముఖ్యంగా కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు అత్యంత కీలకమైనదని, ఈ బాధ్యతను అధికారులు సమర్థవంతంగా నిర్వర్తించాలని మంత్రి పేర్కొన్నారు.

# టీజీ ఆయిల్‌ఫెడ్‌పై మంత్రి తుమ్మల సమీక్ష

**హైదరాబాద్,జూలై24**

తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత అండ్ జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వరరావు(శుక్రవారం హైదరాబాద్ బషీర్‌బాగ్‌లోని పరిశ్రమ భవన్లో టీజీ ఆయిల్‌ఫెడ్ కార్యకలాపాలపై ఉన్నత స్థాయి సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయిల్ పామ్ సాగు విస్తరణ, సంస్థ పనితీరు, ప్రాసెసింగ్ సామర్థ్యం, రైతులకు సకాలంలో చెల్లింపులు, ఆయిల్‌ఫెడ్ అభివృద్ధి కార్యక్రమాలు, భవిష్యత్ కార్యాచరణ తదితర అంశాలపై మంత్రి తుమ్మల అధికారులకు దిశానిర్దేశం చేశారు.



# స్కూల్ యూనిఫాం సరిగ్గా లేకపోతే వాట్సాప్‌లో రివ్యూ ఇవ్వండి..

**హైదరాబాద్,జూలై24**

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాల్లో చదివే విద్యార్థులకు అందజేసే యూనిఫాంల విషయంలో తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై యూనిఫాంలు పంపిణీ చేసిన తర్వాత వాటి నాణ్యత, సైజులు, రంగులు తదితర అంశాలపై నేరుగా ప్రతి విద్యార్థి నుంచి వాట్సాప్ ద్వారా అభిప్రాయ సేకరణ (ఫీడ్‌బ్యాక్) తీసుకోనున్నట్లు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడించారు. విద్యార్థులు ఇచ్చే ఈ ఫీడ్‌బ్యాక్ ఆధారంగానే వచ్చే విద్యా సంవత్సరం నుంచి యూనిఫాంల రంగులు, డిజైన్, పంపిణీ విధానంపై తుది నిర్ణయం తీసుకుంటామని స్పష్టం చేశారు.ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ లోని బోధి పెవిలియన్‌లో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు యూనిఫాంల అందజేత ప్రక్రియపై సీఎం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ.. పేద విద్యార్థులకు అందజేసే దుస్తుల నాణ్యత విషయంలో ఎలాంటి రాజీపడేది లేదని అధికారులకు తేల్చి చెప్పారు. ఆగస్టు 15వ తేదీ నాటికి రాష్ట్రంలోని విద్యార్థులందరికీ యూనిఫాంల పంపిణీ పూర్తికావాలని స్పష్టమైన గడువు విధించారు. ఈ విషయంలో ఏమాత్రం అలసత్వం వహించినా సహించేది లేదని, బాధ్యులపై కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు.మహిళా స్వయం సహాయక సంఘాలు కుట్టు పనిని మరింత వేగవంతం చేసేలా చర్యలు తీసుకోవాలని, దీనికోసం



అన్ని జిల్లాల కలెక్టర్లతో నిరంతరం సమన్వయం చేసుకోవాలని సెర్ప్ ) సీఈవో దివ్యను ముఖ్యమంత్రి ఆదేశించారు. గత ప్రభుత్వ హయాంలో విద్యార్థులకు యూనిఫాంల అందజేతలో తీవ్ర నిర్లక్ష్యం, అక్రమాలు జరిగాయని మండిపడిన సీఎం.. తాము ఈ మొత్తం వ్యవస్థను ప్రక్షాళన చేస్తున్నామని తెలిపారు. తాము పేద పిల్లల సంక్షేమం కోసం పని చేస్తున్నామనే విషయాన్ని అధికారులు ఎల్లప్పుడూ గుర్తుంచుకోవాలని సూచించారు. ఇకపై బడి తెరిచే మొదటి రోజే విద్యార్థుల చేతికి యూనిఫాంలు అందాలనేదే ప్రభుత్వ లక్ష్యమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. అందుకోసం వచ్చే విద్యా సంవత్సరం నాటికి జూన్ 2వ తేదీ నాటికే ప్రతీ విద్యార్థికి యూనిఫాంలు అందేలా ఇప్పటి నుంచే ముందస్తు కార్యాచరణ రూపొందించాలని అధికారులను ఆదేశించారు.

# 'క్షమాపణలు చెప్పండి'..





**హైదరాబాద్,జూలై24**

హైదరాబాద్‌లోని శాంతా కన్స్ట్రక్షన్స్ ప్రైవేట్ లిమిటెడ్ దాఖలు చేసిన మూడు ధిక్కరణ పిటిషన్లపై శుక్రవారం తెలంగాణ హైకోర్టు సంచలన తీర్పునిచ్చింది. హైడ్రా (న్ఱ=ూూా) కమిషనర్ ఎ.వి. రంగనాథ్, ఐపీఎస్‌పై దాఖలైన ఈ పిటిషన్లపై విచారణ చేపట్టిన జస్టిస్ జుకంటి అనిల్ కుమార్ ధర్మాసనం.. అధికారులు వ్యవహరించిన తీరుపై, న్యాయవ్యవస్థ ఆదేశాలను ఉల్లంఘించడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. చట్టబద్ధతను, న్యాయస్థానాల రక్షణను కాపాడటం ప్రతి అధికారి బాధ్యత అని స్పష్టం చేశారు.జూన్ 18న అధికారుల చర్యల నుంచే ఈ ధిక్కరణ వివాదం ఉత్పన్నమైందని, తదుపరి పరిణామాలతో సంబంధం లేకుండా కోర్టు ఆదేశాలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారా లేదా అన్నదే ప్రధానంగా పరిశీలిస్తున్నామని న్యాయమూర్తి స్పష్టం చేశారు. "గతంలో కోర్టు ఆదేశాలను అమలు చేస్తామని ప్రభుత్వ అధికారులు, న్యాయవాదులు పదేపదే హామీలు ఇచ్చినప్పటికీ.. ఆ హామీలను తుంగలో తొక్కి వివాదాస్పద స్థలంలోకి అధికారులు ఎలా ప్రవేశిస్తారు?" అని కోర్టు ప్రశ్నించింది. ఉల్లంఘన జరిగిన తర్వాత సమర్పించే నివేదికలు అంతకుముందు చేసిన కోర్టు ధిక్కరణను రద్దు చేయలేవని తీవ్ర వ్యాఖ్యలు చేసింది.మూడు కోర్టు ధిక్కరణ పిటిషన్లు దాఖలైనప్పటికీ హైడ్రా కమిషనర్ కనీసం క్షమాపణలు కూడా చెప్పకపోవడంపై కోర్టు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించారనే ఆరోపణలు వచ్చినప్పుడు బాధ్యతాయుతమైన అధికారి క్షమాపణలు చెప్పడం కనీస ధర్మమని, పశ్చాత్తాపం వ్యక్తం చేసే ఒక్క మాట కూడా లేకపోవడం పరిస్థితి తీవ్రతను తెలియజేస్తోందని వ్యాఖ్యానించింది. అలాగే, అసలు కేసుల్లో గానీ, రివిజన్ పిటిషన్లలో గానీ భాగస్వామి కాని హైడ్రా కమిషనర్‌కు.. కోర్టు రక్షణ ఉన్న ఆస్తుల విషయంలో జోక్యం చేసుకునే అధికారాలు ఎక్కడివని, ఇది తీవ్రమైన అసాధారణ పరిస్థితులకు దారితీస్తోందని ఆందోళన వ్యక్తం చేసింది.ఇప్పటికే ఆక్రమణలను అడ్డుకోవడానికి రెవెన్యూ, నీటిపారుదల (ఇరిగేషన్) వంటి చట్టబద్ధమైన శాఖలు ఉన్నప్పుడు, ప్రతి విభాగం హైడ్రా వద్దకే వెళ్తే ఆయా శాఖల ఉనికికి అర్థమేముంటుందని ధర్మాసనం నిలదీసింది. జీవో ప్రకారం హైడ్రాకు పోలీసు బలగాలు, భారీ కూల్చివేత యంత్రాలను మోహరించే అధికారం ఎలా వచ్చిందో చెప్పాలని ప్రశ్నించింది. అధికారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తే న్యాయవ్యవస్థ ఉత్తర్వులు హాస్యాస్పదంగా మారతాయని, చట్టానికి ఎవరూ అతీతులు కారని హెచ్చరించింది. దీనిపై పూర్తి వివరాలతో అఫిడవిట్ దాఖలు చేసేందుకు అడ్వకేట్ జనరల్ సమయం కోరగా, హైడ్రా కమిషనర్ రంగనాథ్ వ్యక్తిగత క్షమాపణలతో కూడిన అఫిడవిట్ దాఖలు చేయాలని హైకోర్టు ఆదేశించింది. తదుపరి విచారణను సోమవారానికి వాయిదా వేసింది.

# కరెంట్ సమస్యలా.. దేశంలోనే తొలిగా తెలంగాణాలో ఎలక్ట్రిసిటీ అంబులెన్స్ సేవలు

**హైదరాబాద్,జూలై24**

కరెంట్ సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారా? ఇంట్లో పవర్ ప్రాబ్లం ఉంటే ఎన్నిసార్లు కాల్ చేసినా, వెళ్లి ఫిర్యాదు చేసినా సమస్య పరిష్కారం కావట్లేదా? అయితే మీ కోసం తెలంగాణా ప్రభుత్వం అత్యవసర సేవల తరహాలో కరెంట్ సమస్యల కోసం ఒక కొత్త విధానం మొదలుపెట్టింది.తెలంగాణాలో ఎలక్ట్రసిటీ అంబులెన్స్ సేవలు దేశంలోనే తొలిసారిగా తెలంగాణాలో ఎలక్ట్రసిటీ అంబులెన్స్ సేవలను డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మొదలుపెట్టారు. వైద్య అత్యవసరాలలో 108 సేవలు అందించే తరహాలోనే ఈ కొత్త సేవ పని చేస్తుంది. తీగలు తెగి పడటం, ట్రాన్స్ ఫార్మర్లు పేలటం, షార్ట్ సర్క్యూట్, విద్యుత్ అంతరాయాలు వంటి ఆకస్మిక సమస్యలు ఎదురైనప్పుడు ప్రత్యేకంగా తయారు చేసే వాహనాలు, అనుభవజ్ఞులైన టెక్నీషియన్ ల బృందం వెంటనే ఘటనా స్థలానికి చేరుకొని సమస్యను పరిష్కరిస్తారు.ఖమ్మం జిల్లాలో ఎలక్ట్రసిటీ అంబులెన్స్ లు ఈ అంబులెన్స్ సేవలు మొదట ఖమ్మం జిల్లాలో ప్రారంభించారు. ఈ సేవలను రాష్ట్ర వ్యాప్తంగా విస్తరిస్తున్నారు. ఈ సేవ ద్వారా ప్రజలకు 24 గంటలు అత్యవసర విద్యుత్ సహాయం అందించనున్నారు. ప్రస్తుతం ఖమ్మం జిల్లాలో 4 - 5ఎలెక్ట్రసిటీ వాహనాలు సిద్ధంగా ఉన్నట్టు అధికారులు తెలిపారు.తెలంగాణాలో ప్రజలకు ఇబ్బంది కలగకుండా విద్యుత్ సరఫరా మరింత సుస్థిరం చేయటం కోసం ప్రభుత్వం చేపట్టిన ఒక ముఖ్యమైన అడుగు. సత్వర సేవలను అందించటం కోసమే ఈ స్పెషల్ అంబులెన్స్ లు సహజంగా వర్షాకాలంలో కరెంట్ తీగలు తెగిపోవటం, విద్యుత్ స్తంభాలు పడిపోవటం వంటి సమస్యలు తరచుగా ఎదురవుతాయి. ఇలాంటి సమయంలో సాదాతన సర్వీస్ బృందాలు చేరుకోవటం కాస్త ఆలస్యం అవుతుంది. దీంతో ప్రజలు తీవ్ర అసౌకర్యాన్ని ఎదుర్కోవాల్సి వస్తుంది. ఈ క్రమంలో అలాంటి జాప్యం లేకుండా ఎలెక్ట్రిసిటీ అంబులెన్స్ లు సత్వర సేవలను అందిస్తాయి.సబ్ స్టేషన్ల విస్తరణ, కొత్త ఫీడర్ల నిర్మాణం, స్మార్ట్ మీటర్ల అమలుపై ఫోకస్ ఇప్పటికే తెలంగాణా రాష్ట్ర విద్యుత్ శాఖ ప్రజలకు 24 గంటలు నిరంతరాయ




విద్యుత్ అందించటం కోసం కీలకంగా పని చేస్తుంది. టీజీ ట్రాన్స్ కో మరియు టీజీఎస్పీడీసీఎల్ సబ్ స్టేషన్ల విస్తరణ, కొత్త ఫీడర్ల నిర్మాణం, స్మార్ట్ మీటర్ల అమలు వంటి పనులు వేగంగా జరుగుతున్నాయి. రాష్ట్రంలో వ్యవసాయ, పారిశ్రామిక, గృహ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్ సేవలను అందించటం లక్ష్యంగా పని చేస్తున్నాయి. ఇవి మాత్రమే కాదు రాష్ట్రంలో విద్యుత్ శాఖ డిజిటల్ మ్యాపింగ్, ఫాల్ట్ డిటెక్షన్ సిస్టమ్ లను మెరుగుపరుస్తోంది. మొత్తంగా విద్యుత్ రంగంలో విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టింది.

# మలబద్ధకం సమస్యకు ఇదే బెస్ట్!

**మలబద్ధకం నివారణకు బొప్పాయి ఉత్తమమైన పండు**
**చిలగడదుంప, ఖప్లీ గోధుమ పిండితో మంచి ఫలితం**
**జీర్ణక్రియను సులభం చేసే అవిసె గింజలు, బాదం**
**ఫైబర్ ఉన్న ఆహారం తీసుకున్నప్పుడు నీరు తాగడం ముఖ్యం**
**ఇవి పోషకాహార నిపుణురాలు సోనియా నారంగ్ సూచనలు**



ప్రస్తుత జీవనశైలిలో చాలా మంది ఎదుర్కొంటున్న సాధారణ సమస్య మలబద్ధకం. దీని నుంచి బయటపడటానికి సహజమైన మార్గాల కోసం చూసేవారికి ప్రముఖ పోషకాహార నిపుణురాలు సోనియా నారంగ్ కొన్ని కీలకమైన సూచనలు చేశారు. మలబద్ధకాన్ని ఎదుర్కోవడానికి ఉత్తమమైన పండు 'బొప్పాయి' అని ఆమె స్పష్టం చేశారు. బొప్పాయిలో ఉండే 'పపైన్' అనే ఎంజైమ్, ప్రొటీన్లను సులభంగా విచ్ఛిన్నం చేసి జీర్ణక్రియ సాఫీగా సాగేలా చేస్తుందని వివరించారు. ఈ మేరకు హిందూస్థాన్ టైమ్స్ ఓ కథనం వెలువరించింది. బొప్పాయితో పాటు జీర్ణవ్యవస్థ పనితీరును మెరుగుపరిచే మరికొన్ని ఆహార పదార్థాలను కూడా ఆమె సిఫార్సు చేశారు. వాటిలో కొన్ని:

**కూరగాయ:**

చిలగడదుంప. ఇందులో ఉండే అధిక ఫైబర్, నీటి శాతం మలాన్ని తేలికగా ముందుకు కదిలేలా చేస్తుంది.
పిండి: ఖప్లీ (ఎమ్మర్) గోధుమ పిండి. పొట్టుతో ఉండటం వల్ల ఇందులో ఫైబర్ అధికంగా ఉంటుంది.

**గింజలు:**

అవిసె గింజలు. ఇవి పేగుల్లో కదలికలను సులభతరం చేస్తాయి.

**నట్స్:**

బాదం పప్పులు. వీటిలోని ఆరోగ్యకరమైన కొవ్వులు, మెగ్నీషియం జీర్ణాశయ కండరాలకు విశ్రాంతినిస్తాయి. అయితే, ఫైబర్ అధికంగా ఉండే ఆహారాలు తీసుకున్నప్పుడు తగినంత నీరు తాగడం చాలా ముఖ్యమని సోనియా నారంగ్ నొక్కిచెప్పారు. నీరు సరిగ్గా తీసుకోకపోతే మలబద్ధకం సమస్య మరింత తీవ్రమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ సూచనలు కేవలం సాధారణ అవగాహన కోసం మాత్రమేనని, దీర్ఘకాలంగా ఈ సమస్యతో బాధపడేవారు తప్పనిసరిగా వైద్యుడిని సంప్రదించాలని ఆమె స్పష్టం చేశారు.

# వర్షాకాలంలో ఇమ్యూనిటీ పెంచే ఆహారాలు ఇవే!

**వర్షాకాలంలో రోగనిరోధక శక్తిని పెంచే ఆహారాలపై నిపుణుల సూచనలు**
**విటమిన్ సి అధికంగా ఉండే నారింజ, నిమ్మ వంటి పండ్లను తినాలని సలహా**
**వెల్లుల్లి, అల్లం, ఆకుకూరలు ఇన్ఫెక్షన్లతో పోరాడటంలో సహాయపడతాయని వెల్లడి**
**తేమ వాతావరణంలో వచ్చే వ్యాధుల నుంచి ఈ ఆహారాలు రక్షణ కల్పిస్తాయని నివేదిక**
**వేడిగా వండిన ఆహారం తినడం, పరిశుభ్రత పాటించడం చాలా ముఖ్యమని సూచన**



వర్షాకాలం ప్రారంభంతో వాతావరణంలో తేమ శాతం పెరిగి, ఇన్ఫెక్షన్లు ప్రబలే ప్రమాదం అధికమవుతుంది. ఈ సీజనల్ వ్యాధుల బారి నుంచి మనల్ని మనం రక్షించుకోవడానికి, రోగనిరోధక శక్తిని పెంపొందించే కొన్ని ప్రత్యేక ఆహారాలను రోజువారీ డైట్‌లో చేర్చుకోవాలని ఆరోగ్య నిపుణులు సూచిస్తున్నారు. ముఖ్యంగా కొన్ని రకాల ఆహారాలను క్రమం తప్పకుండా తీసుకోవడం ద్వారా శరీరం సహజ రక్షణ వ్యవస్థను పటిష్ఠం చేసుకోవచ్చని వారు పేర్కొంటున్నారు. వర్షాకాలంలో ఆరోగ్యాన్ని కాపాడే పలు ముఖ్యమైన ఆహార పదార్థాలు అందుబాటులో ఉన్నాయి. వీటిలో విటమిన్-సి పుష్కలంగా ఉండే నారింజ, నిమ్మ, ద్రాక్ష వంటి సిట్రస్ జాతి పండ్లు అగ్రస్థానంలో నిలుస్తాయి. ఇవి శరీరంలో తెల్ల రక్త కణాల ఉత్పత్తిని పెంచి, ఇన్ఫెక్షన్లపై పోరాడే శక్తిని అందిస్తాయి. ప్రతిరోజూ ఒక గ్లాసు గోరువెచ్చని నిమ్మరసం సేవించడం ఆరోగ్యానికి ఎంతో మేలని నిపుణులు సలహా ఇస్తున్నారు. వీటితో పాటు వెల్లుల్లి, అల్లం, ఆకుకూరలు కూడా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. వెల్లుల్లిలోని 'అల్లిసిన్' అనే సమ్మేళనం అద్భుతమైన యాంటీ-బ్యాక్టీరియల్, యాంటీ-వైరల్ గుణాలను కలిగి ఉంటుంది. అల్లం జీర్ణక్రియను మెరుగుపరచడమే కాకుండా, గొంతు నొప్పి వంటి సమస్యల నుంచి ఉపశమనం కలిగిస్తుంది. పాలకూర వంటి ఆకుకూరల్లో విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు సమృద్ధిగా ఉంటాయి. అలాగే నట్స్, విత్తనాలు, తేనె వంటివి శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తూ జలుబు, దగ్గు వంటి సమస్యలను నివారిస్తాయి. వర్షాకాలంలో సాధ్యమైనంత వరకు బయటి ఆహారానికి, పచ్చి కూరగాయలకు దూరంగా ఉండి, ఇంట్లో తాజాగా వండిన వేడి ఆహారాన్ని మాత్రమే తీసుకోవాలని నిపుణులు సూచిస్తున్నారు. ఈ ఆహార నియమాలతో పాటు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా ఈ సీజన్‌లో ఆరోగ్యంగా ఉండవచ్చని స్పష్టం చేస్తున్నారు. అయితే, ఈ సూచనలు కేవలం ఆరోగ్యకరమైన జీవనశైలి కోసం మాత్రమేనని, ఏదైనా తీవ్రమైన అనారోగ్య సమస్యలు తలెత్తినప్పుడు వెంటనే వైద్యులను సంప్రదించడం తప్పనిసరి అని వైద్య నిపుణులు చెబుతున్నారు.

# గుడ్లను ఫ్రిజ్‌లో పెట్టొచ్చా? సైన్స్ ఏం చెబుతోందంటే..!



ఉదయం బ్రేక్‌ఫాస్ట్ నుంచి రాత్రి భోజనం వరకు గుడ్లు చాలా మంది ఆహారంలో భాగమయ్యాయి. అయితే ఒక సందేహం మాత్రం ఎప్పుడూ ఉంటుంది.. గుడ్లను ఫ్రిజ్‌లో పెట్టాలా? లేక బయట ఉంచినా సరిపోతుందా? కొందరు ఎప్పుడూ ఫ్రిజ్‌లోనే నిల్వ చేస్తే.. మరికొందరు గది ఉష్ణోగ్రతలో ఉంచుతారు. మరి ఇందులో సరైన పద్ధతి ఏది? శాస్త్రవేత్తలు ఏమంటున్నారు? 2021లో 'ఫ్రాంటియర్స్ ఇన్ మైక్రోబయాలజీ' జర్నల్‌లో ప్రచురితమైన అధ్యయనం ప్రకారం.. గుడ్లను 25 డిగ్రీల సెల్సియస్ ఉష్ణోగ్రతలో కొన్ని రోజులు ఉంచితే సాల్మొనెల్లా టైఫిమ్యూరియం అనే బ్యాక్టీరియా వేగంగా పెరిగే అవకాశం ఉంది. అదే ఫ్రిజ్‌లో నిల్వ చేస్తే ఆ బ్యాక్టీరియా పెరుగుదల గణనీయంగా తగ్గుతుంది. అంటే గుడ్ల భద్రత, తాజాగా ఉండటంలో ఉష్ణోగ్రత కీలక పాత్ర పోషిస్తుందని పరిశోధకులు చెబుతున్నారు.

**కొన్ని దేశాల్లో తప్పనిసరి?**

అమెరికా వంటి దేశాల్లో మార్కెట్‌లోకి వచ్చే ముందు గుడ్లను ప్రత్యేకంగా కడిగి శుభ్రం చేస్తారు. దీంతో వాటి పెంకుపై ఉండే సహజ రక్షణ పొర (క్యూటికల్) తొలగిపోతుంది. అది లేకపోవడంతో బ్యాక్టీరియా లోపలికి ప్రవేశించే ప్రమాదం పెరుగుతుంది. అందుకే అక్కడ గుడ్లను 4 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువ ఉష్ణోగ్రతలోనే నిల్వ చేయాలని అమెరికా వ్యవసాయ శాఖ సూచిస్తోంది.

**యూరప్, ఆసియా దేశాల్లో పరిస్థితి భిన్నం**

యూరప్, ఆసియాలోని చాలా దేశాల్లో గుడ్లను కడగకుండా విక్రయిస్తారు. దీంతో వాటి సహజ రక్షణ పొర అలాగే ఉంటుంది. అందువల్ల సాధారణంగా ఫ్రిజ్‌లో పెట్టాల్సిన అవసరం ఉండదు. అయితే చల్లని, పొడి ప్రదేశంలోనే నిల్వ చేయాలి. భారత్ వంటి వేడి, తేమ ఎక్కువగా ఉండే దేశాల్లో మాత్రం ఫ్రిజ్‌లో ఉంచితే గుడ్లు ఎక్కువకాలం తాజాగా ఉంటాయని నిపుణులు సూచిస్తున్నారు.

**బ్యాక్టీరియా పెరుగుదలను తగ్గించేది ఫ్రిజ్**

ఎక్కువ ఉష్ణోగ్రతలో సాల్మొనెల్లా ఎంటెరిటిడిస్ వంటి బ్యాక్టీరియా వేగంగా పెరుగుతుంది. గుడ్లను ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల ఈ పెరుగుదల మందగిస్తుంది. అయితే తరచూ ఫ్రిజ్‌లో పెట్టడం, బయటకు తీయడం మంచిది కాదు. ఇలా చేస్తే గుడ్లపై తేమ ఏర్పడి బ్యాక్టీరియా పెరిగే అవకాశాలు పెరుగుతాయి. అందుకే ఒకే ఉష్ణోగ్రతలో నిల్వ చేయడం అత్యంత ముఖ్యం.

**ఇంట్లో గుడ్లను ఎలా నిల్వ చేయాలి?**

సూపర్‌మార్కెట్‌లో ఫ్రిజ్‌లో ఉంచిన గుడ్లను కొనుగోలు చేస్తే ఇంటికొచ్చిన తర్వాత కూడా ఫ్రిజ్‌లోనే పెట్టాలి. వాటిని ఫ్రిజ్ డోర్‌లో కాకుండా లోపలి షెల్ఫ్‌లో అసలు కార్టన్‌తోనే ఉంచడం మంచిది. ఎందుకంటే డోర్ తరచూ తెరవడం వల్ల అక్కడ ఉష్ణోగ్రత మారుతూ ఉంటుంది. స్థానికంగా లభించే కడగని గుడ్లను చల్లని వాతావరణంలో వారం రోజుల వరకు బయట ఉంచవచ్చు. అంతకంటే ఎక్కువ రోజులు నిల్వ చేయాలంటే ఫ్రిజ్‌లో పెట్టడం మంచిది.

**ఫ్రిజ్‌లో పెడితే రుచి మారుతుందా?**

గుడ్లను ఫ్రిజ్‌లో ఉంచితే వాటి రుచి లేదా పోషక విలువలు మారిపోతాయనే అభిప్రాయం చాలామందిలో ఉంది. కానీ దీనికి శాస్త్రీయ ఆధారాలు లేవు. ఫ్రిజ్‌లో ఉంచడం వల్ల గుడ్లు ఎక్కువకాలం తాజాగా ఉండటమే తప్ప వాటి రుచి లేదా పోషకాలు తగ్గవని నిపుణులు చెబుతున్నారు.

# కిడ్నీలో రాళ్ల సమస్య?.. ఈ పండ్లు మీ డైట్‌లో చేర్చుకోండి!



**కిడ్నీలో రాళ్ల సమస్యను ఆహార నియమాలతో తగ్గించుకోవచ్చని నిపుణుల సూచన**
**నిమ్మ, నారింజ వంటి సిట్రస్ పండ్లు రాళ్లు ఏర్పడకుండా నివారిస్తాయని వెల్లడి**
**పుచ్చకాయ వంటివి శరీరానికి నీటిని అందించి రాళ్లను కరిగిస్తాయంటున్న నిపుణులు**
**యాపిల్, బేరి, బొప్పాయి వంటి పండ్లు కిడ్నీ ఆరోగ్యానికి మేలు చేస్తాయని సూచన**
**ఈ పండ్లు కేవలం నివారణకేనని, వైద్యుడి సలహా తప్పనిసరి అని హెచ్చరిక**

ప్రపంచవ్యాప్తంగా కిడ్నీలో రాళ్ల (కిడ్నీ స్టోన్స్) సమస్య పెరుగుతున్న నేపథ్యంలో జీవనశైలి, ఆహారపు అలవాట్లపై ఆరోగ్య నిపుణులు ప్రత్యేకంగా దృష్టి సారిస్తున్నారు. ముఖ్యంగా కొన్ని రకాల పండ్లను ఆహారంలో చేర్చుకోవడం ద్వారా ఈ ముప్పును గణనీయంగా తగ్గించుకోవచ్చని వారు సూచిస్తున్నారు. సరైన మోతాదులో నీరు తాగడంతో పాటు కొన్ని పండ్ల వినియోగం రాళ్లు మళ్లీ మళ్లీ ఏర్పడే ప్రమాదాన్ని నివారిస్తుందని వైద్య పరిశోధనలు స్పష్టం చేస్తున్నాయి.

**కిడ్నీలో రాళ్లు ఎందుకు ఏర్పడతాయి?**

సాధారణంగా కిడ్నీలో రాళ్లు కాల్షియం ఆక్సలేట్ లేదా యూరిక్ యాసిడ్ వంటి ఖనిజ లవణాలు పేరుకుపోవడం వల్ల ఏర్పడతాయి. ఇవి మూత్రపిండాల్లో లేదా మూత్ర నాళాల్లో ఏర్పడి తీవ్రమైన నొప్పిని, ఇతర ఆరోగ్య సమస్యలను కలిగిస్తాయి. ఈ సమస్యకు జన్యుపరమైన కారణాలు ఉన్నప్పటికీ, సరైన ఆహార నియమాలు పాటించకపోవడం, తగినంత నీరు తాగకపోవడం వంటివి ప్రధాన కారణాలుగా నిలుస్తున్నాయి. అయితే, కొన్ని ప్రత్యేకమైన పండ్లను రోజూవారీ ఆహారంలో చేర్చుకోవడం ద్వారా ఈ సమస్యను నియంత్రించవచ్చని నిపుణులు చెబుతున్నారు.

**సిట్రస్ పండ్ల ప్రయోజనాలు**

నిమ్మ, నారింజ, బత్తాయి వంటి సిట్రస్ జాతి పండ్లు కిడ్నీలో రాళ్ల నివారణకు అద్భుతంగా పనిచేస్తాయి. వీటిలో 'సిట్రేట్' అనే రసాయనం అధికంగా ఉంటుంది. ఇది మూత్రంలోని కాల్షియంతో కలిసిపోయి, అది స్ఫటికాలుగా మారి రాళ్లుగా ఏర్పడకుండా అడ్డుకుంటుంది. అలాగే, మూత్రం జూ౹ స్థాయిలని పెంచి రాళ్లు ఏర్పడటానికి ప్రతికూల వాతావరణాన్ని సృష్టిస్తుంది. ముఖ్యంగా రోజూ నీటిలో నిమ్మరసం కలుపుకుని తాగడం చాలా సులభమైన, ప్రభావవంతమైన మార్గమని వైద్యులు సూచిస్తున్నారు. నారింజ పండ్లలో కూడా సిట్రేట్‌తో పాటు విటమిన్ సి పుష్కలంగా ఉంటుంది. అయితే, వీటిలో సహజ చక్కెరలు ఉంటాయి కాబట్టి మితంగా తీసుకోవడం మంచిది.

**శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచే పండ్లు**

పుచ్చకాయ, కర్బూజ వంటి పండ్లలో నీటిశాతం చాలా ఎక్కువగా ఉంటుంది. వీటిని తినడం వల్ల శరీరానికి కావాల్సిన ద్రవాలు అంది, మూత్రం ఉత్పత్తి పెరుగుతుంది. తద్వారా మూత్రపిండాల్లోని ఖనిజ లవణాలు పలుచబడి, సులభంగా బయటకు వెళ్లిపోతాయి. ఇది రాళ్లు ఏర్పడే ప్రక్రియను నెమ్మదింపజేస్తుంది. ఈ పండ్లలో సోడియం శాతం కూడా తక్కువగా ఉండటం వల్ల కిడ్నీల మొత్తం పనితీరుకు మేలు జరుగుతుంది.

**ఇతర మేలు చేసే పండ్లు**

యాపిల్, బేరి వంటి పండ్లలో ఫైబర్, యాంటీఆక్సిడెంట్లు పుష్కలంగా ఉంటాయి. ముఖ్యంగా వీటిలో 'ఆక్సలేట్' స్థాయులు చాలా తక్కువగా ఉంటాయి. కాల్షియం ఆక్సలేట్ రాళ్లతో బాధపడేవారికి ఈ పండ్లు సురక్షితమైనవి. బొప్పాయి కూడా అధిక నీటిశాతంతో పాటు ముఖ్యమైన పోషకాలను అందిస్తుంది. ఇది కూడా కిడ్నీలకు స్నేహపూర్వకమైన ఆహారంగా పరిగణించబడుతుంది. అయితే, ఆహారంలో మార్పులు చేసుకునే ముందు ముఖ్యంగా కిడ్నీ సంబంధిత సమస్యలు ఉన్నవారు తప్పనిసరిగా వైద్యులను సంప్రదించి వారి సలహా పాటించడం అత్యవసరం. ఈ పండ్లు కేవలం నివారణకు, ప్రమాదాన్ని తగ్గించడానికి మాత్రమేనని, ఇప్పటికే ఉన్న సమస్యకు వైద్య చికిత్సకు ప్రత్యామ్నాయం కాదని గుర్తుంచుకోవాలని వైద్య నిపుణులు చెబుతున్న మాట.

# రాగి రోజూ తినడం మంచిదేనా? నిపుణులు చెబుతున్న నిజం ఇదే!

రాగి పోషకాలతో నిండిన ఆరోగ్యకరమైన చిరుధాన్యాల్లో ఒకటి. ఇందులో కాల్షియం, ఐరన్, ఫైబర్, మెగ్నీషియం వంటి పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. ఎముకలు దృఢంగా ఉండేందుకు, రక్తహీనత తగ్గించేందుకు, రక్తంలో చక్కెర స్థాయుల నియంత్రణకు ఉపయోగపడుతుంది. బరువు తగ్గాలనుకునేవారూ రాగిని ఎక్కువగా ఆహారంలో చేర్చుకుంటున్నారు. అయితే రోజూ రాగినే ప్రధాన ఆహారంగా తీసుకోవడం మంచిది కాదని నిపుణులు సూచిస్తున్నారు. గోధుమలు, బియ్యం, ఇతర చిరుధాన్యాలు, పప్పులు, కూరగాయలు, పండ్లతో కూడిన సమతుల్య ఆహారం తీసుకోవడం అవసరమని చెబుతున్నారు. రాగిలో కూడా కార్బోహైడ్రేట్లు ఉండటంతో పరిమిత మోతాదులోనే తీసుకోవాలని సూచిస్తున్నారు.



### వరుస పరాజయాలతో
# పూజా హెగ్డే కెరీర్ డౌన్..

ఒకప్పుడు టాలీవుడ్‌లో స్టార్ హీరోయిన్‌గా అగ్రహీరోల సరసన వరుస అవకాశాలు అందుకున్న పూజా హెగ్డే ప్రస్తుతం కెరీర్‌లో అత్యంత క్లిష్టమైన దశను ఎదుర్కొంటోంది. భారీ చిత్రాల్లో నటించినప్పటికీ వరుస పరాజయాలు ఆమె జోరుకు బ్రేక్ వేశాయి. దీంతో ఒకప్పుడు నిర్మాతల ఫస్ట్ ఛాయిస్‌గా ఉన్న ఈ బ్యూటీ ఇప్పుడు కొత్త అవకాశాల కోసం ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడింది. పూజా హెగ్డే నటించిన సినిమాల్లో 'రాధేశ్యామ్', 'ఆచార్య', 'బీస్ట్', 'కిసీ కా భాయ్ కిసీ కీ జాన్' వంటి భారీ అంచనాల చిత్రాలు బాక్సాఫీస్ వద్ద ఆశించిన ఫలితాన్ని అందుకోలేకపోయాయి. తాజాగా విడుదలైన 'జన నాయగన్' కూడా అంచనాలకు తగ్గట్టుగా వసూళ్లు సాధించలేకపోవడంతో పూజా ఖాతాలో మరో ఫ్లాప్ చేరినట్లైంది. వరుసగా వచ్చిన ఈ పరాజయాలు ఆమె మార్కెట్‌పై ప్రభావం చూపుతున్నాయని సినీ వర్గాలు భావిస్తున్నాయి.ఇండస్ట్రీలో వినిపిస్తున్న కథనాల ప్రకారం, భారీ పారితోషికం డిమాండ్ చేయడం కూడా నిర్మాతలను ఆలోచనలో పడేస్తోందని టాక్. మరోవైపు ఇటీవల ఆమె నటించిన కొన్ని చిత్రాల్లో పాత్ర నిడివి తగ్గిపోవడం, ఎడిటింగ్ సమయంలో కీలక సన్నివేశాలు తొలగించబడటం కూడా చర్చనీయాంశమైంది. దీంతో ముఖ్యంగా తెలుగులో కొత్త అవకాశాలు ఆశించిన స్థాయిలో రావడం లేదనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. సినిమాల్లో సక్సెస్ లేకపోయినా సోషల్ మీడియాలో మాత్రం పూజా హెగ్డే క్రేజ్ ఏమాత్రం తగ్గలేదు. ఇన్‌స్టాగ్రామ్ సహా ఇతర సోషల్ మీడియా వేదికల్లో ఆమెకు భారీ ఫాలోయింగ్ ఉంది. ఫోటోషూట్లు, బ్రాండ్ ప్రమోషన్లు, ఎండార్స్‌మెంట్ల ద్వారా ఆమె ఇప్పటికీ మంచి ఆదాయాన్ని పొందుతున్నారు. ఫ్యాషన్, లైఫ్‌స్టైల్ బ్రాండ్లకు ఆమె ఇప్పటికీ ప్రాధాన్యమైన సెలబ్రిటీగా కొనసాగుతున్నారు.



## మారుతి దర్శకత్వంలో?




వరుణ్‌తేజ్ నటించిన హారర్ కామెడీ థ్రిల్లర్ 'కొరియన్ కనకరాజు' ఆగస్ట్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ఈ సినిమా తర్వాత ఆయన తన సోదరి నిహారిక నిర్మిస్తున్న 'బరి' సినిమా షూట్‌లోకి ఎంట్రీ ఇస్తారు. 'కమిటీ కుర్రోళ్లు'ఫేం యదువంశీ ఈ సినిమాకు దర్శకుడు.వరుణ్‌తేజ్ నటించిన హారర్ కామెడీ థ్రిల్లర్ 'కొరియన్ కనకరాజు' ఆగస్ట్ 7న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానున్నది. ఈ సినిమా తర్వాత ఆయన తన సోదరి నిహారిక నిర్మిస్తున్న 'బరి' సినిమా షూట్‌లోకి ఎంట్రీ ఇస్తారు. 'కమిటీ కుర్రోళు ్ల'ఫేం యదువంశీ ఈ సినిమాకు దర్శకుడు. పనిలోపనిగా ఆ తర్వాత చేసే సినిమాను కూడా వరుణ్‌తేజ్ లైన్‌లో పెట్టబోతున్నారని ఇన్‌సైడ్ టాక్.

## ఆ ఒక్కటి అడగొద్దు!



పూర్తిస్థాయిలో దక్షిణాది సినిమాలపై దృష్టిపెట్టేందుకు ఇటీవలే ముంబయి నుంచి చెన్నైకి షిఫ్ట్ అయింది అగ్ర కథానాయిక శృతిహాసన్. డూడుల్ ఆర్టిస్ట్ శంతను హజారికాతో నాలుగేళ్ల ప్రేమాయణానికి బ్రేకప్ చెప్పిన ఈ భామ ఇప్పుడు సినిమాలే తన ప్రపంచమని చెబుతున్నది.పూర్తిస్థాయిలో దక్షిణాది సినిమాలపై దృష్టిపెట్టేందుకు ఇటీవలే ముంబయి నుంచి చెన్నైకి షిఫ్ట్ అయింది అగ్ర కథానాయిక శృతిహాసన్. డూడుల్ ఆర్టిస్ట్ శంతను హజారికాతో నాలుగేళ్ల ప్రేమాయణానికి బ్రేకప్ చెప్పిన ఈ భామ ఇప్పుడు సినిమాలే తన ప్రపంచమని చెబుతున్నది. తాజాగా సోషల్‌మీడియాలో అభిమానులతో ముచ్చటించిన ఈ సొగసరి వారు అడిగిన ప్రశ్నలకు ఆసక్తికరమైన సమాధానాలిచ్చింది. పెళ్లెప్పుడంటూ పలువురు అభిమానులు అడిగిన ప్రశ్నలకు 'ఆ ఒక్కటి తప్ప మరేదైనా అడగండి.

## ఇప్పటికీ సింగిలే.. పెళ్లి చేసుకోవాలని అనుకున్నవారు మెసేజ్ చేయండి..!



ఒకప్పుడు ఆనందం సినిమాతో తెలుగు ప్రేక్షకుల హృదయాలను గెలుచుకున్న హీరోయిన్ రేఖ వేదవ్యాస్ చాలా కాలంగా సినిమాలకు దూరంగా ఉన్నప్పటికీ, తాజాగా ఇచ్చిన ఓ ఇంటర్వ్యూలో తన వ్యక్తిగత జీవితం, ప్రేమ, పెళ్లి గురించి చెప్పిన విషయాలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఇంటర్వ్యూలో రేఖ వేదవ్యాస్ మాట్లాడుతూ.. తాను ఇప్పటికీ పెళ్లి చేసుకోలేదని వెల్లడించారు. సల్మాన్ ఖాన్‌లాగే నేనూ సింగిల్‌గానే ఉండిపోతానేమో అంటూ నవ్వేశారు. తాను ఇంకా సింగిల్‌గా ఉన్నానని చెప్పినా చాలామంది నమ్మరని,ఎవరో ఒకరు ఉంటారులే అని అనుకుంటారని అన్నారు. తనకు కాబోయే భర్త ఎలా ఉండాలని అడిగిన ప్రశ్నకు రేఖ ఎంతో పరిపక్వతతో సమాధానం ఇచ్చారు.

### రామాయణంలో సీతగా సాయి పల్లవి..
## బుల్లితెర సీత దీపిక చిఖాలియా స్పందన





నితేశ్ తివారీ రామాయణం చిత్రంలో టాలీవుడ్ నటి సాయి పల్లవి సీత పాత్రలో నటిస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో రామానంద్ సాగర్ బుల్లితెర రామాయణంలో సీత పాత్రలో అమరిన దీపిక చిఖాలియా ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు.“రణబీర్ కపూర్, సాయి పల్లవి ఇద్దరూ చాలా మంచి నటులు. సాయి పల్లవి పని చూశాను. ఆమె అద్భుతమైన నటి. రణబీర్ కూడా అద్భుత నటుడు. ఇద్దరూ తమ పాత్రలను అందంగా చూపిస్తారని నాకు నమ్మకం ఉంది” అని దీపిక చిఖలియా అన్నారు. దీపిక చిఖాలియా 1987లో రామానంద్ సాగర్ టీవీ 'రామాయణం'లో సీత పాత్రలో నటించి భారతీయుల హృదయాల్లో చెరగని స్థానం సంపాదించారు. నితేశ్ తివారీ దర్శకత్వంలో తెరకెక్కుతున్న ఈ రామాయణం పార్ట్-1 దీపావళి సందర్భంగా విడుదల కానుంది. ఈ చిత్రం భారీ బడ్జెట్ ప్రాజెక్టుగా రూపొందుతోంది. దీపిక చిఖలియా వ్యాఖ్యలు సాయి పల్లవి అభిమానుల్లో ఉత్సాహం నింపాయి.

## 'చెన్నై లవ్‌స్టోరీ' మూవీ రివ్యూ

ఇప్పటి వరకు ఎన్నో ప్రేమకథలు వెండితెరపై ఆవిష్కరించబడ్డాయి. ఈ ప్రేమకథలను కొత్తగా ప్రజెంట్ చేయగలిగితే ప్రేక్షకులు ఆదరిస్తారు అనే నమ్మకంతో దర్శకులు సరికొత్త ప్రేమకథలతో ప్రేక్షకుల ముందుకు వస్తున్నారు. ఈ కోవలోనే 'బేబీ' సినిమాతో ఉత్తమ స్క్రీన్‌ప్లే రచయితగా జాతీయ అవార్డును అందుకున్న సాయిరాజేష్ తన కథతో, ఎస్‌కేఎన్‌తో కలిసి నిర్మించిన చిత్రం 'చెన్నై లవ్‌స్టోరీ'. కిరణ్ అబ్బవరం హీరోగా నటించిన ఈ చిత్రానికి రవి నంబూరి దర్శకుడు. ఈ చిత్రం ప్రచారంలో ముందు నుంచే ఇదొక కల్ట్ బ్లాక్‌బస్టర్ అనే ట్యాగ్‌ను యాడ్ చేసిన ఈ చిత్రం ప్రేక్షకులను అలరించిందా? ఈ ప్రేమకథలో అందరి హృదయాలను హత్తుకునే అంశాలున్నాయా? లేదా? అనేది చిత్ర సమీక్షలో తెలుసుకుందాం... నివి (శ్రీ గౌరి ప్రియ) మూడేళ్లుగా ప్రేమించిన అబ్బాయి అజయ్ (త్రిగుణ్)ని పెళ్లి చేసుకోని అందమైన జీవితాన్ని గడపాలని ఊహించుకుంటుంది. కానీ పెళ్లి ముహూర్త సమయానికి అజయ్ తనకు ఈ పెళ్లి ఇష్టం లేదని, తాను మరో అమ్మాయిని ఇష్టపడుతున్నానని, నివికి బ్రేకప్ చెప్పి బెంగళూరు వెళ్లిపోతాడు. ఈ సంఘటనతో షాక్‌లో ఉన్న ఆమె మనసు ముక్కలైపోతుంది. ఈ బాధని మరిచిపోవడానికి తన స్నేహితులతో కలిసి చెన్నై వెళ్లిపోతుంది. ఊరు మారినా తన మనసు మారదు. విఫలప్రేమ బాధ నుంచి బయటపడటానికి ఆల్కహాల్‌కు అలవాటుపడుతుంది. ఈ సమయంలోనే సినిమా రంగంలో దర్శకత్వ అవకాశం కోసం వేచి చూస్తున్న అనాథ స్టీవెన్ శంకర్ (కిరణ్ అబ్బవరం) నివి స్నేహితులు ఉండే ఇంట్లోనే ఆశ్రయం సంపాందిస్తాడు. ఆ ఇంట్లో



అందరితో సరదాగా ఉండే స్టీవెన్ పనులు మాత్రం నివికి విసుగు తెప్పిస్తాయి. స్టీవెన్ విషయంలో తన ప్రవర్తన కరెక్ట్ కాదని తెలుసుకున్న తను క్రమంగా అతడ్ని ఇష్టం పడటం మొదలుపెడుతుంది. స్టీవెన్ మాత్రం ఆమెను ఓ దేవతలా ఆరాధిస్తుంటాడు. ఓ రోజు సడన్‌గా 'మనం పెళ్లి చేసుకుందామా' అని అడుగుతుంది. అప్పుడు స్టీవెన్ ఏం చేశాడు? వీళ్ల ప్రేమకథ సక్సెస్ అవుతుందా? పెళ్లిపీటల మీద పెళ్లిని కాదని వెళ్లిపోయిన అజయ్ మళ్లీ నివి జీవితంలోకి ఎందుకొచ్చాడు? స్టీవెన్ శంకర్‌కు దర్శకత్వ చాన్స్ వచ్చిందా? నివి ఎవరిని పెళ్లి చేసుకుంది అనేది మిగతా కథ.